@vaartanews @mvnewstv
మన మీ..
# వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.mivaartanews.com
TGBIL/25/A0512
బుధవారం
14 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
సంపుటి : 02
సంచిక :103
పేజీలు : 12 వెల : 5/-



వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857



PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE


# అడుగంటిన భూగర్భజలాలు

- నీళ్లు లేక ఎండుతున్న పంటలకు ట్యాంకర్లతో నీరు
- తిమ్మారెడ్డిగూడ రైతుల అవస్థలు
- రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతోంది
- వర్షాలు పడకపోవడంతో పాటు ఉన్న భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు పంటలను బతికించుకునేందుకు ట్యాంకర్లను తెప్పించుకునే దుస్థితి ఏర్పడింది.



హైదరాబాద్

వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నాడు. పొలంలో నీరు లేక వరి పంట ఎండిపోతుండటంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పంటకు అందిస్తున్నారు. రోజుకు రూ.1,000 అద్దె చెల్లిస్తూ పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న రైతుల పరిస్థితి అన్నదాతల కష్టాలకు అద్దం పడుతోంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాజు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు తగ్గిపోయితున్నాయి. దాంతో బోరుబావుల్లో నీటి మట్టం పడిపోవడంతో సకాలంలో నీరు అందడం లేదు. దీనికి తోడు విద్యుత్ సరఫరా కూడా సక్రమంగా లేకపోవడంతో పంటకు నీరు పెట్టలేని పరిస్థితి నెలకొంది. పంటకు నీరు అందక ఎండిపోతుండటంతో ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపాడు. గత వారం రోజులుగా రోజుకు 10 నుంచి 15 ట్యాంకర్ల నీటిని పొలానికి - మిగతా 11లో



## దేశ ప్రజలంతా మోదీ, ఎన్డీఏ వైపే

- వరుసగా నాలుగోసారీ కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయం
- రాష్ట్రాలు, ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుస ఓటములు తప్పట్లేదని అమిత్ షా
- గుజరాత్, బంగాల్, తమిళనాడు, యూపీలో కాంగ్రెస్ దారుణ పరాజయం పొందింది
- ఈ ఓటములకు ఎన్నికల సంఘాన్ని నిందించవద్దు

# రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

- నేతలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- ఢిల్లీలోని రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం
- గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి.
- గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దు
- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం
- ఎవరి పరిధిలో వాళ్లు గట్టిగా పని చేయాలి
- పట్టభద్రుల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు, విద్యుత్ కొరత, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై నేతలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. ఢిల్లీలోని రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో అందుబాటులో ఉన్న నేతలతో సీఎం, పీసీసీ అధ్యక్షుడు సమావేశమయ్యారు. గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో మంత్రులు, ఎమెల్యేలు సైతం పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. ఎవరి పరిధిలో వాళ్లు గట్టిగా పని చేయాలని, పట్టభద్రుల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని సీఎం స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు - మిగతా 11లో

## శబరిమలలో ఫొటోగ్రఫీ, డ్రోన్లపై బ్యాన్

- రోడ్డ పక్కన వంటపైనా నిషేధం
- శబరిమల మండల-మకరవిళక్కు సీజన్ నేపథ్యంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డ్రోన్లపై నిషేధంతో పాటు మాంసాహారం, హోటళ్లపైనా ఆంక్షలు విధించింది.
- సన్నిధానంలోని నలంబలం లోపల భక్తులు విచ్చలవిడిగా కెమెరాలు, మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల దర్శనానికి తీవ్ర ఆటంకం



# స్వరాష్ట్రానికి కాంగ్రెస్ నేతలు

- ముగిసిన టీ కాంగ్రెస్ నేతల ఢిల్లీ పర్యటన..
- హైదరాబాద్‌కు బయలుదేరిన సీఎం రేవంత్ రెడ్డి
- 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' నిరసన ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలు..
- ఇండీ కూటమి సమావేశం అనంతరం స్వరాష్ట్రానికి పయనం
- 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొన్న నేతలు



హైదరాబాద్/ఢిల్లీ

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల ఢిల్లీ పర్యటన ముగిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరారు. రాత్రి 8 గంటల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, రోహిన్ రెడ్డిలు ఢిల్లీ నుంచి బయలుదేరినట్లు సమాచారం. ఏఐసీసీ పిలుపు మేరకు ఆదివారం ఢిల్లీకి వెళ్లిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు మూడు రోజుల పర్యటన అనంతరం స్వరాష్ట్రానికి తిరుగు ప్రయాణమయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులతో పాటు మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన - మిగతా 11లో



## లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే

- చైనా వాదనలకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్
- లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమేనని భారత్ మరోసారి స్పష్టం చేసింది
- చైనా వైపు నుంచి ఎన్ని తిరస్కరణలు వచ్చినా ఆ వాస్తవాన్ని మార్చలేవని గట్టిగా సమాధానం ఇచ్చింది.
- "భారత్ తీసుకున్న ఈ చర్య చట్టవిరుద్ధం
- చైనా- భారత్ సరిహద్దులోని పశ్చిమ భాగం చైనాకు చెందినది అనే వాస్తవాన్ని ఇది మార్చదు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రీన్ సిగ్నల్



- ఎల్బీనగర్ - హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం
- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్ శంకుస్థాపన ప్రతిపాదనకు ఆమోదముద్ర పడింది.
- అలాగే పర్వతమాల పథకం ద్వారా తెలంగాణకు 5 రోప్ వేలకు ఆమోదం
- ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు ఆహ్వానం

హైదరాబాద్

రాష్ట్రంలో చేపట్టనున్న కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. అలాగే కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం వల్ల జాతీయ రహదారి 167పై తెలంగాణ నుంచి ఏపీకి అనుసంధానం జరిగి, రవాణా - మిగతా 11లో



## దేశ ప్రజలంతా మాతో ఉన్నారు

- జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు: రాహుల్
- రాహుల్ గాంధీ నివాసంలో 'ఇండీ' కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులకు తేనీటి విందు ఏర్పాటు
- "మేమంతా ఇక్కడ ఏకతాటిపై, ఒక్కటిగా నిలబడి ఉన్నాం
- నేను సోమవారం చెప్పినట్లు సమాంతరంగా నిరసనలు ఏమీ లేవు

## సంపాదకీయం

# రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు 2027 ముప్పు

ప్రకృతి ప్రకోపించినప్పుడు ఏ ప్రభుత్వమైనా, ఎంతటి బలమైన వ్యవస్థ అయినా ఒక్కసారిగా కుదేలవుతుంది. అందులోనూ ఎల్ నినో వంటి వాతావరణ విపత్తులు పాలకులకు నిద్రలేకుండా చేసే అత్యంత క్లిష్టమైన సవాళ్లు. భూగోళం వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ అనూహ్య వాతావరణ మార్పులు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాలను ఛిన్నాభిన్నం చేస్తాయి. నీరు అనేది లేకపోతే మానవ జీవనమే మూగబోతుంది. తాగునీరు కరవైతే జనజీవనం అస్తవ్యస్తమవుతుంది, సాగునీరు అందకపోతే అన్నదాత కన్నీరుమున్నీరవుతాడు. ఇటు తాగు, సాగు నీటి కొరత ఏర్పడితే జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా పడిపోయి కరెంట్ కోతలు మొదలవుతాయి. తద్వారా పారిశ్రామిక ఉత్పాదకత దెబ్బతిని, నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతాయి. ఇదొక దుర్భిక్షపు విషవలయం.ప్రస్తుతం దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను కమ్ముకువస్తున్న ముప్పు కేవలం సాధారణ ఎల్ నినో కాదు. అంతకంటే ఎన్నో రెట్లు భీకరమైన సూపర్ ఎల్ నినో . రుతుపవనాలు చేతులెత్తేయడంతో ఈసార వర్షపాతం అంతంతమాత్రంగానే నమోదైంది. జలాశయాలు సగం కూడా నిండని దుస్థితిలో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని వచ్చే ఏడాది జూన్ వరకు తీవ్రమైన పొదుపుతో, అత్యంత అప్రమత్తంగా వాడుకోవాల్సిన కత్తిమీద సాములాంటి పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటిపోతున్న ఈ తరుణంలో పాలకులకు ఇది మునుపెన్నడూ లేని విధంగా అగ్నిపరీక్షగా మారింది.ఈ కరవు పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో ప్రజల్లో తీవ్రమైన అసహనం, ఆగ్రహం వ్యక్తమవడం సహజం. తాగునీరు అందక, విద్యుత్ కోట్లు పెరిగి, పంటలు ఎండిపోతున్న సమయాల్లో సగటు జీవి అగ్గిమీద గుగ్గిలమౌతాడు. ఈ సహజమైన ప్రజా అసహనాన్ని, నిరాశను పాలకులపై తిరుగుబాటుగా మలచడానికి, రాజకీయ లబ్ధి పొందడానికి ప్రతిపక్షాలు ఎప్పుడూ కాచుకుని కూర్చుంటాయి. ప్రభుత్వంపై బురదజల్లేందుకు, ప్రజలను రెచ్చగొట్టేందుకు ఇదే అదనుగా భావిస్తాయి. అయితే, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటూ కేవలం పోలీసు బలంతోనో, ప్రకటనలతోనో ఈ విపత్తును నియంత్రించడం ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు.మరి ఈ పెనుముప్పు నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వాలు చేయాల్సింది ఏమిటి? ముందుగా పారదర్శకతతో కూడిన వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ఉన్న నీటి వనరులు, విద్యుత్ లభ్యతపై ప్రతి పౌరుడికి ముందస్తు అవగాహన కల్పించాలి. నీటిని, కరెంటును ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలో వివరిస్తూ ఒక ప్రజా ఉద్యమంలాంటి ప్రచారాన్ని చేపట్టాలి. ఈ సూపర్ ఎల్ నినో విపత్తును కేవలం ప్రభుత్వ సమస్యగా కాకుండా, ఇది మనందరి ఉమ్మడి సంక్షోభం అనే భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రతి గృహం, ప్రతి రైతన్న, ప్రతి పారిశ్రామికవేత్త నీటి పొదుపులో భాగస్వామ్యులుగా మారేలా విప్లవాత్మకమైన మార్గదర్శకాలను అమలు చేయాలి.ప్రజలను ఈ విపత్తు నిర్వహణలో భాగస్వామ్యం చేసినప్పుడే ప్రభుత్వాలపై భారం తప్పుతుంది, కాస్త రిలీఫ్ దొరుకుతుంది.పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం, విపరీతంగా వేడెక్కుతున్న సముద్రాలు రాబోయే కాలంలో ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికల ప్రకారం, ఈ సహజ వాతావరణ దృగ్విషయం డిసెంబర్‌లో శిఖరాగ్రానికి చేరుకుని 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల వల్ల పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఈ ఎల్ నినో ప్రభావం తోడవడంతో 2027 అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్‌హౌస్ ఉద్గారాలు భూమిని నిరంతరం వేడెక్కిస్తున్నాయి. దీనికి తోడు ఎల్ నినో కారణంగా సముద్రాల నుండి విడుదలయ్యే అదనపు వేడి వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తుంది. ఈ రెండు పరిణామాలు కలిసికట్టుగా పనిచేయడం వల్ల, రాబోయే 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతలలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సహజ సిద్ధమైన వాతావరణ చక్రం. అయితే దీని ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా టెలికనెక్షన్ ప్రభావం చూపుతుంది.ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాభావం, కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. దక్షిణ అమెరికాలోని పశ్చిమ తీర ప్రాంతాలు పెరూ, ఈక్వెడార్ వంటి దేశాలు భారీ వర్షాలు, ఆకస్మిక వరదలను ఎదుర్కొనే అవకాశం ఉంది.వాతావరణంలో వచ్చే ఈ తీవ్రమైన మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆసియా, ఆస్ట్రేలియాలో వర్షపాతం తగ్గడం వల్ల గోధుమ, బియ్యం వంటి ప్రధాన పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సముద్ర జీవగోళం, ముఖ్యంగా పగడపు దిబ్బలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. విపత్కర పరిస్థితులను దాటవేయడంలో పాలకుల ముందుచూపు, ప్రజల సహకారం రెండు చక్రాలలా పనిచేస్తాయి. కనీవినీ ఎరుగని ఈ నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణ రూపొందించి, క్షేత్రస్థాయిలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే, రాబోయే వేసవిలో ప్రజాగ్రహం తుఫానులా మారి ప్రభుత్వాల కొలువులను కూల్చడం తథ్యం. కాలం దాటిపోకముందే అప్రమత్తమై, ప్రతి చుక్క నీటిని భద్రపరిచే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించడమే పాలకుల ముందున్న ఏకైక కర్తవ్యం.

# పబ్లిసిటీకి తప్ప ఎందుకూ పనికిరానిది!



ఈ పబ్లిసిటీ కూడా లోగడ ఇరాన్ యుద్ధం విషయంలో జరిగినటువంటిదే. భారత ప్రజాస్వామ్యానికి గల మూలాధారాల్లో ఒకటైన పౌరుల స్వేచ్ఛాయుత ఓటు హక్కుకు బుద్ధిపూర్వకంగా కలిగిస్తున్న భంగపాటుతో చెలరేగిన అశాంతికి పరిష్కారం కనుగొనని, లేదా కనుగొనదలచని మోదీ, యూరప్‌లో నాలుగేండ్లుగా సాగుతున్న యుద్ధానికి శాంతిసూత్రాలను కనుగొన్నారంటే నవ్వు సహజంగానే వస్తుంది. ఆయనకు పబ్లిసిటీ ఎంత ప్రాణప్రదమైనదో గుజరాత్ కాలం నాటి విషయం మనకు తెలియదుగాని, 2014 నుంచి జాతీయ స్థాయిలో మాత్రం విరామమెరుగక చూస్తూనే ఉన్నాం. ప్రధాని మోదీ ప్రచార ప్రణాళికలో ఒక పార్శ్వం దేశీయమైతే మరొకటి అంతర్జాతీయం. తన ప్రచారదుర్గంలో భాగంగా 'విశ్వగురు' అనే మాటను కూడా తమ మొదటి ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారు. తన కోసం తన వందిమాగధులతో ఆ బిరుదు ఇప్పించుకున్నారు. ఏ దేశానికి పోయినా అక్కడి అత్యున్నత పౌరసత్కారాలు, పతకాలను మరే దేశాధినేత చేయని విధంగా ఇప్పించుకోవటం ఒక సంప్రదాయంగా మార్చుకున్నారని అంతర్జాతీయ మీడియా ఇటీవలనే కథనాలు రాసింది. హడావుడిగా తయారు చేయించటం వల్ల ఆ పతకాలూ పత్రాల్లో కొన్ని సందర్భాల్లో దొర్లిన తప్పులను కూడా ఎత్తిచూపింది. ప్రధాని మోదీ పబ్లిసిటీ కాంక్షకు ఇటువంటివన్నీ దృష్టాంతాలవుతున్నాయి. అటువంటి కోవలోకి వచ్చేదే రష్యా-ఉక్రెయిన్ శాంతిసూత్రం సంగతి. అయితే ఆయన అధికారులు ఒక జాగ్రత్త తీసుకున్నారు.

మోదీ సూత్రాలు అసలు యుద్ధ పరిష్కారానికి అనిగాక, యుద్ధం వల్ల తలెత్తిన తక్షణ సమస్యల నివారణకు అని పేర్కొన్నారు. ఇంతకూ ఆ సూత్రాలు ఏమిటి? ఒకటి, రెండు దేశాలు కూడా అవతలి పక్షపు మౌలిక సదుపాయాలపై దాడులు ఆపటం. రెండు, నిత్యావసరాల సరఫరాలకు ఆటంకం కలిగించకపోవటం. మూడు, నల్ల సముద్రం మీదుగా వాణిజ్య నౌకల రాకపోకలకు రక్షణ కల్పించటం. వాస్తవానికి వీటిలో ఏ ఒక్కటీ మోదీ ప్రభుత్వం కొత్తగా చేసిన ప్రతిపాదన కాదు. ఐక్యరాజ్య సమితి సహా వేర్వేరు వైపుల నుంచి లోగడ వచ్చినవే. వేర్వేరు పక్షాలు తరచు పునశ్చరిస్తున్నవే. ఈ మాట మోదీ విదేశాంగశాఖకు తెలియదనుకోలేము. అంతేకాదు. దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, లేనట్టయితే అనేక దేశాలకు ఆహార ధాన్యం, ఎరువుల రవాణాలో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని ఐక్యరాజ్య సమితి, అమెరికా, ఆఫ్రికన్ దేశాలు చేసిన విజ్ఞప్తి దరిమిలా కొద్ది వారాలపాటు ఉభయపక్షాలు కొన్ని సడలింపులను ఇచ్చాయి కూడా. తర్వాత వెనుకటి పరిస్థితే ఏర్పడింది.

ఇటువంటి నేపథ్యమంతా ఉన్నందున ఈ తరహా శాంతి పథకాలను ముందుకు తేవటాన్ని మిగిలిన వారు మరచిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మోదీ ప్రభుత్వానికి గుర్తుకువచ్చింది. అందుకు కారణం పైన అనుకున్నట్టు ప్రస్తుతం భారతదేశంలో సాగుతున్న అశాంతి అనుకుంటే పొరపాటు ఉండకపోవచ్చు. కానీ ఈ ఎత్తుగడ పారగల అవకాశం లేదు. స్వదేశంలోని అశాంతి తీవ్రంగా మారుతున్నది. అందుకే కావచ్చు ఈ యుద్ధశాంతి వార్తలను మోదీ అనుకూల పత్రికలు కూడా సీరియస్‌గా తీసుకోలేదు.

శాంతి నెలకొనాలని, ఆ ప్రాంతం నుంచి సరఫరాలు సవ్యంగా సాగాలని కోరుకోవటంలో తప్పుపట్టవలసిందేమీ లేదు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్యగల నల్ల సముద్రం కీలకమైనది. రష్యా నుంచి చమురు తదితరాలు, ధాన్యం ఆ సముద్రం మీదుగా నిరంతరం రవాణా అవుతుండేవి. 2022 నుంచి సాగుతున్న యుద్ధం కారణంగా ముఖ్యంగా ఉక్రెయిన్ నుంచి ఈ రవాణాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సముద్రం మధ్యలో గల క్రిమియా దీవిని రష్యా ప్రస్తుత యుద్ధానికి ముందే 2014లో ఆక్రమించటం ఉక్రెయిన్‌కు మరింత సమస్య అయింది. ఈ పరిణామాల వల్ల సమస్యలను ఎదుర్కొంటున్న దేశాల్లో ఇండియా ఒకటి. కనుక, అసలు ఆ యుద్ధం ముగియాలని, లేదా కనీసం సరుకుల రవాణా సజావుగా సాగాలని కోరుకోవటం సహజం. ఇక్కడ సమస్య ఆ కోరికతో కాదు. కానీ, ఆ యుద్ధం ఎంత సంక్లిష్టమైనదో, రవాణా స్తంభనలు ఆ వ్యూహంలో ఎట్లా విడదీయరాని భాగంగా మారాయో తెలిసి కూడా ఇప్పుడు ఈ ప్రతిపాదనల కపటత్వమన్నది విమర్శించదగిన విషయమవుతున్నది.

మరొకటి కూడా ఉన్నది. అది మరింత ముఖ్యమైనది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధమంటూ మొదలు కావటానికి కొన్ని మూల కారణాలున్నాయి. అవి తరచు చర్చకు వస్తున్నవే. సోవియెట్ యూనియన్, వార్సా సైనిక కూటమి 1991లో రద్దయిన తర్వాత, అమెరికా నాయకత్వాన ఉండిన నాటో సైనిక కూటమిని రద్దు చేయకపోవటమే గాక, ఆ కూటమిలోకి కొత్త దేశాలను చేర్చుకుంటూ రష్యా సరిహద్దుల వైపు విస్తరించటం మొదలుపెట్టారు. నాటో విస్తరణ ఉండదంటూ ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదు. ఆ విధంగా విస్తరణలో ఉక్రెయిన్ వంతు వచ్చింది. అనగా రష్యాను పశ్చిమ దిశలో దిగ్బంధం చేయడమన్నమాట. అది తగదన్న రష్యా మాటను అమెరికా, యూరప్‌లు లెక్క చేయలేదు. ప్రధానంగా ఈ కారణం వల్లనే రష్యా ఆత్మరక్షణ కోసం 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనపరచుకున్న తర్వాత, 2022లో ఉక్రెయిన్‌పై దాడిని మొదలుపెట్టింది. ఈ వరుస క్రమాన్ని నిరుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం గుర్తించి మాట్లాడటం గమనించదగ్గది.

భారత ప్రధాని ఈ మౌలిక విషయాలను గుర్తించకుండా, అందుకు పరిష్కారాలను చర్చించకుండా, పైపైన మెరుగుమాటలు మాట్లాడటం వల్ల ఉపయోగమేమిటి? తనకు ఎవరూ నమ్మని పబ్లిసిటీ తప్ప. పైగా ఇవన్నీ గతంలోనూ ఇతరుల ద్వారా ప్రతిపాదనకు వచ్చి విఫలమైనప్పుడు? సమస్య పరిష్కారానికి రష్యా ప్రతిపాదనలు ఏమిటి? ఉక్రెయిన్ కోరుకుంటే యూరోపియన్ యూనియన్‌లో చేరవచ్చు గానీ, నాటోలో చేరబోమని ప్రకటించాలి. ఆ మేరకు తమ రాజ్యాంగాన్ని సవరించాలి. వారిని చేర్చుకొనబోమని నాటో కూడా ప్రకటించాలి. ఉక్రెయిన్ తూర్పున రష్యా సరిహద్దుల్లో గల దోన్‌బాస్ ప్రాంతంలో అధిక సంఖ్యాకులైన రష్యన్ జాతీయులపై వివక్షలను ఆపివేసి, వారికి సముచిత స్థానాలు కల్పించాలి. భవిష్యత్తులో తమ రక్షణ కోసం దోన్‌బాస్ ప్రాంతాన్ని తమకు బఫర్‌జోన్‌గా వదలాలి. ఇవి ప్రధానం.

ఇందులో గమనించవలసింది దోన్‌బాస్ ఇప్పటికే సుమారు 80 శాతం గత నాలుగేండ్ల యుద్ధంలో రష్యా ఆధీనంలోకి వెళ్లిపోయింది. తక్కినది కూడా వదలుకుని రాజీ చేసుకోవాలని స్వయంగా ట్రంప్ ఒకటికి నాలుగుసార్లు ఉక్రెయిన్ ప్రధాని జెలెన్‌స్కీకి సూచించారు. అదేమాట ఈ నెల 10న కూడా అన్నారు. ఒక దశలో జెలెన్‌స్కీ సైతం అర్థాంగీకారం తెలిపారు. తాము కూడా అదేమాట అన్న యూరోపియన్ నాయకులు అంతలోనే మాట మా ర్చారు. యుద్ధానికి సాయపడుతున్నారు.

ఆ విధంగా యుద్ధానికి లోతైన నేపథ్య కారణాలుండగా, ఆ సమస్య పరిష్కారానికి చిక్కుముళ్లు అనేకం ఉన్నాయి. అవి తేలనంతవరకు నల్ల సముద్ర ప్రాంతంలో, ఇతరత్రా కూడా ఉభయపక్షాల మధ్య యుద్ధం సాగుతూనే ఉంటుంది. సరకుల రవాణాకు ఆటంకాలు కల్పించటం కూడా యుద్ధ వ్యూహంలో భాగమే. అది ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహం. అటువంటి స్థితిలో మీరు ఆ వ్యూహాన్ని మానుకుని మాకు మాత్రం సరకుల రవాణా జరిగేటట్టు చూడమంటూ చెప్పే శాంతిసూత్రాలు నెరవేరేవేనా? అవి సొంత పబ్లిసిటీకి తప్ప ఎందుకూ ఉపయోగపడవు. ఇది ఇరాన్ యుద్ధంలో, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల యుద్ధం గురించి ఏమీ మాట్లాడకుండా, హోర్ముజ్‌ను తెరవండి అంటూ ఇరాన్‌కు ప్రతిపాదించటం వంటిదే. మోదీ విశ్వగురుత్వం ఎంత అర్థరహితమైనదో అనేక ఇతర దృష్టాంతాలతోపాటు ఇది కూడా చెప్తున్నది.

# హామీల అమలు కోసం 'సింగరేణి గర్జన'

అంటూ సింగరేణి ప్రాంత ప్రముఖ కవి దయానర్సింగ్ ఆలపించిన పాట సింగరేణి కార్మికుల జీవితాల్లోని అన్యాయాన్ని, ఆవేదనను కండ్లకు కట్టింది. దేశ సౌభాగ్యానికి వారు తమ రక్తాన్ని ధారపోసి, వెలుగులు పంచి, వారు మాత్రం చీకట్లలో మగ్గిపోతున్నారు. వివిధ రకాల అనారోగ్య సమస్యలను వారు ఎదుర్కొంటున్నా నేటి పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు మళ్లీ సింగరేణి బొగ్గు గనుల్లో నేడు ప్రతిధ్వనిస్తున్నాయి. తమ హక్కుల కోసం ఉద్యమించిన కార్మికులు గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏడు డిమాండ్లతో కూడిన లేఖ రాయడం సింగరేణి వాడల్లో ప్రాధాన్యతను సంతరించుకున్నది. సింగరేణి కార్మికుల సంక్షేమానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న కేసీఆర్ కార్మికుల పక్షపాతిగా వారి హృదయాల్లో స్థానం దక్కించుకున్నారు. 201415లో 21 శాతంగా ఉన్న లాభాల వాటాను 202223 నాటికి 32 శాతానికి పెంచారు. ఆ ఏడాది రూ.711 కోట్ల వాటాను అందించారు. కార్మికుల పదవీ విరమణ వయస్సు 58 ఏండ్ల నుంచి 61కు పెంచారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించే విధానాన్ని రూపొందించారు.

ఉద్యోగుల వేతన ప్రయోజనాల కోసం తెలంగాణ ఇంక్రిమెంట్ అందించారు. అర్హులైన ఉద్యోగులకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని గృహ రుణాలు, ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులకు మెరుగైన వైద్యం, కార్మికుల పిల్లల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తి చేసే సంస్త మాత్రమే కాదు, తెలంగాణ ఆర్థిక ప్రగతి రథచక్రం. వేలాది కార్మిక కుటుంబాలకు జీవనాధారం. తరతరాల శ్రమకు, శ్రమజీవుల త్యాగాలకు ప్రతీక. భూమి పొరల్లోకి దిగి, ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికితీసే కార్మికుల కష్టంతోనే విద్యుత్తు వెలుగులు విరజిమ్ముతున్నాయి. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కింది.



సింగరేణి కార్మికుల సొంతింటి కలను నిజం చేస్తామని, ప్రతి కార్మికుడికీ 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం అందించాలనే హామీ కల కలగానే మిగిలిపోయింది. వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, లాభాల్లో మెరుగైన వాటా ఇస్తామని చెప్పిన హామీలకు అతీగతీ లేదు. పెర్క్‌పై ఆదాయపు పన్నును కంపెనీ చెల్లించేలా చేస్తామని కాంగ్రెస్ నమ్మబలికింది. ఈ సమస్యను కూడా పరిష్కరించలేదు. కార్మికుల శ్రమను గుర్తించడంతో పాటు, లాభాల్లో న్యాయమైన వాటా కల్పించడం కూడా అంతే ముఖ్యం. 202324 ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల నికర లాభం, 202425లో రూ.6,394 కోట్ల లాభం వచ్చినప్పటికీ బోనస్ చెల్లింపుల్లో కార్మికులకు తగిన న్యాయం జరుగలేదు. సంస్థ లాభాల్లో కార్మికులకు 36 శాతానికి పైగా వాటా చెల్లించాలని, వాస్తవ లాభాల ఆధారంగా బోనస్ నిర్ణయించాలని కార్మికలోకం కోరుకుంటున్నది. సింగరేణి కార్మికులకు ఏటా దసరా సందర్భంగా బోనస్ ప్రకటించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బోనస్‌ను ప్రకటించినప్పటికీ, నిరుడితో పోలిస్తే బోనస్ భారీగా తగ్గింది. దీంతో కార్మికులు తీవ్ర అసహనంతో ఉన్నారు. నిరుడు ఒక్కో కార్మికుడికి రూ.1,95,610 బోనస్ ప్రకటించగా, ఈ ఏడాది రూ.1,53,912 మాత్ర మే ప్రకటించారు. కార్మికుల శ్రమ పట్ల కాంగ్రెస్ సర్కార్‌కు ఏపాటి గౌరవం ఉన్నదో దీనిని బట్టి అర్థమవుతున్నది. కార్మికుల కుటుంబాలకు వారసత్వ ఉద్యోగాలు ఉపాధి కాదు, కుటుంబ భద్రతకు భరోసా. అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికుల విషయంలో యాజమాన్యం మెడికల్ బోర్డులను సకాలంలో నిర్వహించి, నిబంధనల ప్రకారం అర్హులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలి. మెడికల్ బోర్డుల కోసం ఎదురుచూస్తున్న 2,500 మందికి పైగా కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర విద్యుత్తు సంస్థల నుంచి సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నది. ఈ మొత్తాలు పెండింగ్‌లో ఉండటం సింగరేణి ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నది. కార్మికుల భద్రత, సంక్షేమానికి అవసరమైన నిధులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి. దశాబ్దాలుగా కార్మికుల శ్రమతో ఎదిగిన ఈ సంస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది. కానీ, ప్రస్తుతం ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించే యత్నాలు చేస్తున్నది. తెలంగాణకు మకుటాయమైన సింగరేణిని ప్రైవేటుపరం కాకుండా రక్షించుకోవాలి. అందుకోసం తెలంగాణ ప్రజలంతా పోరాడాలి. 'పోరాడితే పోయేదేమీ లేదు..బానిస సంకెళ్లు తప్ప' అనే నినాదాన్ని అందుకుని కార్మికలోకం సింగరేణి యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నేడు గోదావరిఖని సింగరేణి స్టేడియం లో 'సింగరేణి కార్మిక గర్జన' నిర్వహించబోతున్నారు. నల్లసూర్యులకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా కార్మికుల పక్షాన గొంతెత్తేందుకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ సభకు రానున్నారు. కార్మికులను దగా చేస్తున్న కాంగ్రెస్ దోపిడీ పాలనపై సమరభేరి మోగించనున్నారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని కార్మికులు, ఉద్యోగుల హెచ్చరిస్తున్నారు.

# ప్రజలకు సామాజిక న్యాయం, సమానత్వం అందించడమే SDPI ప్రధాన లక్ష్యం

- రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మన్సూర్ షా

**మీ వార్త అక్టోబర్ 13 సూర్యపేట జిల్లా ప్రతినిధి :**



**హైదరాబాద్:** ప్రజలకు సామాజిక న్యాయం, సమానత్వం,గౌరవప్రదమైన జీవనం అందించడంతో పాటు రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించడం ఎస్ డి పి ఐ పార్టీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మన్సూర్ షా పేర్కొన్నారు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడారు.

సమాజంలోని అణగారిన వర్గాలు, మైనారిటీలు, వెనుకబడిన ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయడం, ప్రతి పౌరుడికి విద్య, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా ప్రజా సమస్యలపై పోరాడడం పార్టీ లక్ష్యాల్లో ముఖ్యమైనవిగా ఆయన ప్రసంగాన్ని వివరించవచ్చు.

కులం, మతం, భాష, ప్రాంతం ఆధారంగా ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించే సమాజ నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ప్రస్తావించారు ప్రజల హక్కుల పరిరక్షణ, మహిళల సాధికారత, రైతులు, కార్మికుల సంక్షేమం,యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా వార్తలో పొందుపరచవచ్చు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో ప్రజా హక్కుల కోసం కృషి చేయడం రాజకీయ పార్టీల బాధ్యత అని ఎస్ డి పి ఐ సిద్ధాంతాల నేపథ్యంలో పేర్కొనవచ్చు.

సమాజంలో శాంతి, సామరస్యం,పరస్పర గౌరవం పెంపొందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయడమే పార్టీ ఆశయమని తెలిపారు ఈ సమావేశంలో స్టేట్ జనరల్ సెక్రటరీ అఫ్వాన్, స్టేట్ వర్కింగ్ కమిటీ నెంబర్ ముస్తా అబ్దుల్, షేక్ మస్తాన్, షేక్ సాజిత్, షేక్ హుస్సేన్, ఎస్.కె నజీర్,షేక్ రహీం, ఎండి రహమత్ తదితరులు పాల్గొన్నారు.

# జన హృదయ నేతకు జన్మదిన వేడుకలు

- నినాదాలతో మారు మ్రోగిన చౌరస్తా ప్రాంతం..
- ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ..

**చిట్యాల అక్టోబర్ 13 మీవార్త :**

తెలంగాణ తొలి శాసనసభాపతి ఎమ్మెల్సీ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో మధుసూదనాచారి జన్మదిన వేడుకలు నిర్వహించిన అనంతరం టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రం చౌరస్తాలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా మధుసూదనాచారికి శుభాకాంక్షలు నిండు నూరేళ్లు ఉన్నత పదవులతో ఎదుగుతూ జీవించాలని ప్రార్థిస్తూ టపాసులు పేల్చి నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా రమేష్ ముదిరాజ్ తో యుగేందర్. మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా ఏర్పాటు కేవలం సిరికొండ మధుసూదనాచారితో మాత్రమే సాధ్యమైంది అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా



చిట్యాల లో ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు

కేంద్రానికి చేస్తూ ఎనిమిది కిలోమీటర్ల పాటు సెంటర్ లైటింగ్ సిస్టమును ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని వారు తెలిపారు చిట్యాల లో 50 పడకల ఆసుపత్రి జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఆయన కృషి మూలంగానే వచ్చాయని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పూర్తిచేసి అద్భుతమైన అభివృద్ధిని సాధించారని కొనియాడారు. కొన్ని కారణాల మూలంగా ఓటమిపాలైన భూపాలపల్లి నియోజకవర్గం అభివృద్ధి



కోసం నేటికీ ఆయన కృషి చేస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కన్నెబోయిన అశోక్. కొత్త శ్రీను. జంబుల చంద్రమౌళి. సంగ రాజేందర్. ఎండి శంషుద్దీన్ ఎజ్జిగిరి ఆనందం. గురుకుంట్ల కిరణ్. ఉప్పుల కిరణ్. రాయని శ్రీకాంత్ .నల్ల నవీన్. తీగల బాలకృష్ణ .ఆనందా చారి. మోతుకూరి సంతోష్. వేముల హరీష్. భయగాని గణపతి. బొట్ల రవీ. బొంకూరి సమ్మయ్య .కార్తేవుల రాజయ్య .ఆర్.ఎం.పి భాస్కర్ .నేరెళ్ల ఓదెలు. మందల రాజేష్. బండి తిరుపతి .గుర్రం విజేందర్. కోడెల రాజమల్లు . గుర్రం సుశ్రిత్ రాజు నాయక్ మల్లయ్య .ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల చిరకాల స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడంలో సిరికొండ పాత్ర కీలకం

- సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకల్లో చదువు అన్నారెడ్డి

**చిట్యాల అక్టోబర్ 13 (మీవార్త) :**

తెలంగాణ ప్రజల చిరకాల స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడంలో సిరికొండ మధుసూదనాచారి పాత్ర ఎంతో కీలకమని సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి చదువు అన్నారెడ్డి అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి, ప్రజలకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చదువు అన్నారెడ్డి మాట్లాడారు. ఆంధ్ర పెత్తందారీ వ్యవస్థలో నలిగిపోతున్న తెలంగాణను, ఆంధ్రుల కబంధహస్తాల నుండి విముక్తి చేసేందుకు



2001లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడిగా, పోలిట్ బ్యూరో సభ్యుడిగా, కేసీఆర్ కు కుడి భుజంలా వ్యవహరిస్తూ..తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ఆయన చేసిన ఉద్యమ స్ఫూర్తి వర్ణనాతీతమన్నారు. స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడమే కాకుండా..అభివృద్ధికి నోచుకోని, మారుమూల ప్రాంతమైన భూపాలపల్లికి..జయశంకర్ పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా నామకరణం చేసి, నూతన జిల్లాకు జీవం పోసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అదేవిధంగా స్వరాష్ట్రంలో భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, పల్లె పల్లెకు సీసీ రోడ్లు, బస్సు సౌకర్యం, త్రాగునీటి సమస్య లేకుండా..పల్లెలను అనుసంధానం చేసిన అభివృద్ధి ప్రదాత సిరికొండ అని కొనియాడారు. 2028లో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థిగా అధిష్టానం సిరికొండ మధుసూదనాచారిని ప్రకటిస్తే భారీ మెజార్టీతో గెలిపించి..కేసీఆర్ కు కానుకగా ఇస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ మండల ఉపాధ్యక్షుడు దానవేణి రాములు, సిరికొండ మధుసూదనాచారి వీరాభిమాని, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సలాలి సమాధానం, బీఆర్ఎస్ నాయకులు గుడిమల్ల రమేష్, అరికాంతపు అన్నారెడ్డి, కక్కెర్ల ప్రశాంత్ గౌడ్, రాస ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.72 లక్షల నిధులతో రామంతాపూర్ నేతాజీ నగర్, రాజేంద్రనగర్ శ్మశాన వాటికల అభివృద్ధి



- ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి కృషితో

**రామంతాపూర్, అక్టోబర్ 13 ( తెలుగు తేజం):**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషితో రామంతాపూర్‌లోని నేతాజీ నగర్, రాజేంద్రనగర్ శ్మశాన వాటికల అభివృద్ధి కోసం రూ.72 లక్షల నిధులు మంజూరయ్యాయి.మంగళవారం రామంతాపూర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలిసి శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ వెంటనే రూ.72 లక్షల నిధులను మంజూరు చేయడంతో పాటు, టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నే రామంతాపూర్ నేతాజీనగర్,రాజేంద్ర నగర్ శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు జరిగాయని,గత 10 సంవత్సరాలుగా ఈ స్మశానవాటికలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని పరమేశ్వర్ రెడ్డి గారు తెలిపారు.ప్రస్తుతం పూర్తి స్థాయి అభివృద్ధి కోసం ఎంఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి రూ.72 లక్షల నిధులు మంజూరు చేయించామని తెలిపారు.ఈ సందర్భంగా రామంతాపూర్ కాంగ్రెస్ నాయకులు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి , పరమేశ్వర్ రెడ్డి లకు





ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్, రఫిక్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఉదయ్ భాస్కర్ గంగపుత్ర, పూస సత్తి అన్న, షాగా శ్రీధర్, సచిన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తొలగించాలని ప్రజావాణిలో వినతి

**అక్టోబర్13( మన మీవార్త తుంగతుర్తి ప్రతినిధి) :**



తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని 11 వ వార్డు అప్పారావు పంతులు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నుతొలగించి వీధిలైటు వేయాలని కోరుతూ సోమవారం నాడు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ప్రజావాణిలో సీనియర్ జర్నలిస్ట్ బి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు, 11వ వార్డులో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మూలంగా వీధిలైటు వేయకపోవడంతో వచ్చిపోయే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని ఆయన అన్నారు ప్రజాభిప్రాయం సేకరించకుండా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు అలాగే ప్రతినిత్యం ఈ వీధి గుండా తాటిపాముల నందా పురం, వస్తా కొండూరు తదితర ప్రాంతాలకు ప్రయాణికులు స్కూల్ విద్యార్థులను తీసుకువెళ్లే బస్సులు ఆటోలు వెళ్తుంటాయి ఈ మూల మీద రాత్రి వేళలో ప్రమాదాల జరిగే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, అక్టోబర్ 13 ( మన మీ వార్త):**

దేవి నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్ డివిజన్లలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. దేవి నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకలని, అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరికీ మేలు జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాంస్కృతిక సంప్రదాయాలకు దాండియా ఉత్సవాలు ప్రతీకలు: రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, అక్టోబర్ 13 ( మన మీ వార్త):**



ఉప్పల్ భగాయత్‌లో ఆర్ ఆర్ ఆర్ రుద్రం రంగ్ రాస్ దాండియా గర్బ ఉత్సవ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ



కార్పొరేటర్ శ్రీమతి రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన దాండియా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దాండియా ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో ఉత్సాహాన్ని నింపడంతోపాటు ప్రజల మధ్య సామాజిక ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆమె అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్‌తో పాటు సందీప్, సల్ల ప్రభాకర్, భాస్కర్, బాపిరెడ్డి, ప్రశాంత్, బాబీ, రఘు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## టేకుమట్ల టియుడబ్ల్యూజే నూతన కమిటీ ని సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**టేకుమట్ల అక్టోబర్ 13 (మన మీ వార్త )**



ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ ఆధ్వర్యంలో టేకుమట్ల మండలంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జర్నలిస్ట్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మారపల్లి రాజ కొమురయ్య ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ కోశాధికారి కన్నూరి రమేష్ భూపాలపల్లి డివిజన్ ఉప కార్యదర్శి దసారపు ప్రశాంత్ ను గౌరవ పూర్వకంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్ రామచంద్ర మాదిగ, దూడపాక శ్రీనివాస్ మాదిగ, మండల నాయకులు, ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షులు రేణికుంట్ల శంకర్ మాదిగ, అంబేద్కర్ యువజన మండల అధ్యక్షులు మారాపెల్లి కొమురయ్య, ఎమ్మార్పీఎస్ మండల ప్రధానకార్యదర్శి ఇల్లందుల శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి మచ్చ పైడి మాదిగ, ఎం ఎస్పి మండల ఉపాధ్యక్షులు ఎలుకటి నర్సయ్య మాదిగ, వికలాంగుల మండల అధ్యక్షులు అంబు కుమారస్వామి, వికలాంగుల మండల ప్రధానకార్యదర్శి కోంద్ర తిరుపతి,మాజీ ఉపసర్పంచ్ మచ్చ రాజయ్య, బొడ్డు రమేష్, ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మారాపెల్లి చిన్న కొమురయ్య మాదిగ, ఉద్దామారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## టేకుమట్లలో ఘనంగా సిరికొండ మధుసూదనా చారి జన్మదిన వేడుకలు

**టేకుమట్ల అక్టోబర్ 13 (మన మీ వార్త )**

టేకుమట్ల మండల కేంద్రం లో తెలంగాణ రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత గౌరవ సిరికొండ మధుసూదనాచారి అభిమానులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రజాసేవలో మీరు





మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనసు పూర్తిగా కోరుకుంటున్నాం అని బిఆర్ఎస్ పార్టీ నాయకులు వారి అభిమానులు అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు బిఆర్ఎస్ మండల నాయకులు మహిళా నాయకులు సిరికొండ అభిమానులు యువజన నాయకులు తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధ సంస్థకు వ్యతిరేకంగా నిరసన!

- ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి
- డీఈవోకు బీజేపీ నాయకుల ఫిర్యాదు
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించొద్దు

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 మీ వార్త :**





**వనపర్తి జిల్లా న్యూస్ :** రాజ్యాంగబద్ధ సంస్థ అయిన భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు నిరసన చేపట్టడాన్ని ఖండిస్తూ బీజేపీ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.బీజేపీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల నిరసనపై సమగ్ర విచారణ చేపట్టి, సేవా నియమావళి ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, వాణిజ్య సెల్ కన్వీనర్ కొండోజు గోపీనాథ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అరవింద్ తదితరులు పాల్గొన్నారు...

## శ్రీ గాయత్రి దేవి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు

- మిత్రబృందంతో అమ్మవారిని దర్శించుకున్న దామోదర్ గౌడ్
- బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక
- మహిళల భక్తి, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ నిదర్శనం

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో అక్టోబర్ 13 మీ వార్త :**



**దేవరకద్ర న్యూస్ :** గాయత్రి దేవి నవరాత్రుల సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ గండోల్ల దామోదర్ గౌడ్ తన మిత్రబృందంతో కలిసి శ్రీ గాయత్రి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా గండోల్ల దామోదర్ గౌడ్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తుందని తెలిపారు.

దసరా నవరాత్రులు అమ్మవారి ఆరాధనకు ఎంతో విశిష్టమైనవని, ఈ పవిత్ర రోజుల్లో ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు పొందాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.మన పండుగలు, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, యువత మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని దామోదర్ గౌడ్ పిలుపునిచ్చారు...

## మూడవరోజు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**(లక్ష్మణ్ చందా, అక్టోబర్ 13 మన మీ వార్త):**



మండలంలోని ధర్మారం గ్రామంలో మూడవరోజు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి అమ్మవారిని అలంకరించి శరన్నవరాత్రులు సందర్భంగా మూడవ రోజు అయిన ఆశ్వయుజ శుద్ధ విదియ తదియ తిథియందు మన ధర్మారం గ్రామంలో సాక్షాత్తు ఆకాశి క్షేత్రాధిపతి అయిన శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులందరికీ దర్శనమిచ్చారు. ఈ యొక్క అమ్మవారి చేతిలో బంగారు గరిటె అమృత పాత్రను ధరించి సకల జీవరాశుల ఆకలి తీర్చే కరుణామయి మన అన్నపూర్ణమ్మ తల్లిని దర్శించుకుంటే సంసారంలో, తిండికి,గుడ్డకు ఎటువంటి లోటు ఉండదని, ఈరోజు అమ్మవారికి ప్రీతికరమైన దద్దోజనం సమర్పించారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ నుండి మహా అన్నదానం కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు, మాత స్వాములు, భక్తులు గ్రామ ప్రజలు వీడిసి సభ్యులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగురాలిపై అత్యాచారం కేసులో నిందితునికి జైలు శిక్ష

**టేకుమట్ల అక్టోబర్ 13 (మన మీ వార్త) :**

మానసిక వికలాంగురాలి పై అత్యాచారం చేసిన కేసులో నిందితిని పై నేరం రుజువు అయినందున భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్త శ్రీ జీ. జీవన్ కుమార్ నిందితునికి 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు 3000/ రూపాయలు జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చినారు.

తేదీ 28 11 2021 రోజున టేకుమట్ల మండలం, మందలూరి పల్లె గ్రామానికి చెందిన పాక్షికంగా మూగ చెవుడు గల మానసిక వికలాంగురాలు 40 సంవత్సరాలు గల మహిళ తన ఇంటి వద్ద ఒంటరిగా ఉన్నది గమనించి అదే గ్రామస్తుడైన బండి శంకర్ S/O పాపయ్య, కులం గౌడ వయసు 55 సంవత్సరాలు గల వ్యక్తి మానసిక వికలాంగుల ఇంటి లోనికి అక్రమంగా ప్రవేశించి ఆమె పై బలవంతంగా అత్యాచారం చేస్తుండగా అదే సమయంలో ఆమె తల్లి వచ్చింది గమనించి సదరు నిందితుడు శంకర్ అక్కడి నుండి పారిపోయినాడు.

ఈ విషయమై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి టేకుమట్ల ఎూనా గా ఉన్న ఖ. రమణా రెడ్డి SI కేసు నమోదు చేసినారు, తదుపరి ఇట్టి కేసును అప్పటి చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ P.వెంకట్ దర్యాప్తు ప్రారంభించి నిందుతున్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు, తదుపరి నిందితునిపై సరైన సాక్షాదారాలతో కోర్టులో చార్జ్ షీట్ బయలుదేరి చేసినారు.

ఇట్టి కేసులో విచారణ సమయంలో పబ్లిక్ ప్యాసిక్యూటరీ ఎదులాపురం శ్రీనివాస్ తన వాదనలు వినిపించినారు, విచారణ సమయంలో దీ. రాజు కోర్ట్ మానిటరింగ్ ఆఫీసర్ PCR ఇన్స్పెక్టర్ క పర్యవేక్షణలో కోర్టు లైజెనింగ్ ఆఫీసర్ G. వెంకన్న, ASI, మరియు కోర్టు కానిస్టేబుల్స్ జష్ట్ర.జ్యోతి,ౖా.శ్వేత లు, కోర్ట్ లో ప్రవేశ పెట్టినారు, బరోసా నుండి లీగల్ సపోర్ట్ ఆఫీసర్ +. రజిత సహకారం అందించారు, విచారణ అనంతరం నిందితునిపై నేరం రుజువు అయినందున గౌరవ న్యాయమూర్తి శ్రీ జీ.జీవన్ కుమార్ నిందితునికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 3000/- రూపాయలు జరిమానా విధిస్తూ మంగళవారం నాడు తీర్పు వెలువరించినారు.

ఇట్టి కేసులో నిందితునికి శిక్షపడేలా సమర్థవంతంగా పనిచేసిన అప్పటి దర్యాప్తు అధికారులను మరియు ప్రస్తుత భూపాలపల్లి ఐూ్రా, ూా. సంపత్ రావు , ప్రస్తుత చిట్యాల జ×.సతీష్ మరియు ప్రస్తుత ూ×, +. అమూల్య, కోర్టు మానటరింగ్ ఆఫీసర్ౖాజ= ఇన్



స్పెక్టర్ దీ. రాజు, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ూూ× +.వెంకన్న,కోర్టు కానిస్టేబుల్స్ జష్ట్ర. జ్యోతి,ౖా. స్వేత మరియు భరోసా

భరోసా లీగల్ సపోర్ట్ ఆఫీసర్ +.రజిత లను భూపాలపల్లి జిల్లా ూ్రా శ్రీ సిరిశెట్టి సంకీర్త్ ఖూా ప్రత్యేకంగా అభినందించినవారు.

# జవహర్ నగర్ శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ ఫేస్-1 లో ఘనంగా దేవి నవరాత్రుల ఉత్సవాలు

- ఛత్రపతి శివాజీ టీమ్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహా అన్నదానం.

**జవహర్ నగర్ ,అక్టోబర్ 13(వార్త ప్రతినిధి) :**

జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్ శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ ఫేస్-1 లో 'ఛత్రపతి శివాజీ టీమ్ యూత్' ఆధ్వర్యంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రపత్తుల నడుమ అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు కనులవిందుగా దర్శనమిచ్చారు. లోకానికే ఆహారాన్ని ప్రసాదించే అన్నపూర్ణాదేవి అవతారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున మహా అన్నదాన



కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ఆర్.సి. శ్రీకాంత్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. అలాగే ప్రముఖ జర్నలిస్టులు ఇంద్రపాల్, సత్యనారాయణ అంబాల, విష్ణు, దావత్ అరుణ్, అంబాల మల్లేష్ హాజరై అమ్మవారి ఆశీస్సులు పొంది, ప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలను మరియు మహా అన్నదానాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడంలో భవాని మాల ధరించిన చంద్రయ్య, సుజాత, దత్తా, ప్రసన్న రావు, కనకలక్ష్మి, యశ్వంత్, ఆరుషి, సాయి, లక్ష్మి, శ్రీనివాస్, వెంకటేష్, మహేష్, సంతోష్, శ్యామల, చితారి, హరీష్, సురేష్, కమలాకర్, శ్రావణ్ తదితర కాలనీవాసులు, యూత్ సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించి సేవలు అందించారు. అమ్మవారి కృపతో కాలనీవాసులంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# టస్కా చిల్కానగర్ అధ్యక్షుడు బొమ్మగాని దాస్ గౌడ్‌కు ఘన సన్మానం





**ఉప్పల్, అక్టోబర్ 13 ( మన మీ వార్త):**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టస్కా) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో చిల్కానగర్ డివిజన్ శాఖ అధ్యక్షుడు బొమ్మగాని దాస్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.టస్కా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 11న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సమావేశానికి సన్నాహకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. టస్కా రాష్ట్ర అధ్యక్షుడు పి. నరసింహారావు మాట్లాడుతూ, చిల్కానగర్ శాఖ ఆవిర్భావ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించి సీనియర్ సిటిజన్లలో ఉత్సాహాన్ని నింపిన దాస్ గౌడ్ సేవలు అభినందనీయమని కొనియాడారు.

అనంతరం బొమ్మగాని దాస్ గౌడ్ మాట్లాడుతూ, వృద్ధుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి చేరువ చేయడం తమ శాఖ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలు, నాయకత్వ ప్రతిభను గుర్తిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా శాఖ ప్రముఖులు, పెద్దలు ఆయనను ఘనంగా సత్కరించారు.

ఈ సమావేశంలో చిల్కానగర్ శాఖ ప్రధాన కార్యదర్శి బోడ విద్యాసాగర్, కోశాధికారి శామీర్‌పేట చంద్రయ్య, సలహాదారు పెండెం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# మాజీ శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారికి వేముల చిన్న జన్మదిన శుభాకాంక్షలు

- బేగంపేటలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

**రామంతాపూర్, అక్టోబర్ 13 ( మన మీ వార్త):**

తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి 70వ జన్మదిన వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు వేముల చిన్న ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం బేగంపేటలోని కుందన్‌బాగ్‌లో ఉన్న మధుసూదనాచారి అధికార నివాసానికి వెళ్లిన వేముల చిన్న, ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారికి





ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులతో కలిసి పనిచేయడం గర్వకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేముల చిన్నతో పాటు సంపత్ రావు, సంతోష్ రావు, పాపిరెడ్డి తదితరులు పాల్గొని సిరికొండ మధుసూదనాచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి



**టేకుమట్ల అక్టోబర్ 13 (మన మీ వార్త ) :**

టేకుమట్ల మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో, చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగంపెల్లి కిరణ్ రావు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్విచ్ ఆన్ చేసి సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. కాలనీలో విద్యుత్ దీపాలు వెలగడంతో స్థానిక ప్రజలు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచమల్ల సంపత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తోట ముండయ్య, ప్రధాన కార్యదర్శి రాచమల్ల రవీందర్,ఉపాధ్యక్షులు సముద్రాల తిరుపతి, వార్డ్ మెంబర్ రేణికుంట్ల రమణకుమార్,రేణికుంట్ల రాములు,రేణికుంట్ల సంపత్, రమేష్ భాస్కర్, కుమార్, అజయ్ ,శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో ది ఫ్యాషన్ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న తుంగతుర్తి రవి





**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 13 (మన మీ వార్త) :**

మేడిపల్లి డివిజన్ పరిధిలోని మేడిపల్లి నుంచి పర్వతాపూర్ వెళ్లే మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ది ఫ్యాషన్ క్లబ్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో యజమాని సుభాని ఆహ్వానం మేరకు మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆకాష్ రెడ్డి,బోడిగె ప్రశాంత్ గౌడ్, ఫ్యాషన్ క్లబ్ యాజమాన్య సభ్యులు సుభాని, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రారంభమైన ఫ్యాషన్ క్లబ్ యాజమాన్యానికి తుంగతుర్తి రవి, శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార రంగంలో మంచి గుర్తింపు సాధించి, మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## కలెక్టరేట్‌లో రేపు బతుకమ్మ సంబరాలు.. ముగ్గులు, పాటల పోటీలు

**మన మీ వార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో రేపు (బుధవారం) వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

అక్టోబరు 14న సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉద్యోగులందరికీ పాటల పోటీలు, అంత్యాక్షరి, స్టాండప్ కామెడీ పోటీలు జరగనున్నాయి.

అలాగే వివిధ శాఖల మధ్య ఉత్తమ బతుకమ్మ, ఉత్తమ వేషధారణ, ఉత్తమ బిందీ పోటీలను నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన మాజీ జడ్పీటిసి పబ్బా మహేష్ గుప్తా

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (13):**



శివ్వంపేట మండలం గంగాయి పల్లి గ్రామంలో గతం వారం రోజుల క్రితం మరణించిన పారిశుద్ధ్య కార్మికుడు ఒగ్గు రమేష్ కుటుంబానికి మాజీ జడ్పీటీసీ సభ్యులు ప్రముఖ సంఘ సేవకులు పబ్బ మహేష్ గుప్తా రూ .5000 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వడం జరిగింది.బాధిత కుటుంబానికి స్థానిక ఉపసర్పంచ్ పవన్ కుమార్ గుప్తా అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగరాజు హుస్సేన్,బీఆర్ఎస్ నాయకులు సదానందం పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీరు రోడ్డుపాలు!

- ఏడాదిగా పైపులైన్ లీకేజీ...పట్టించుకోని అధికారులు!
- ఎంపీడీఓ, ఏఈలకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం...తండా ప్రజలతో కలిసి ఆందోళన చేపడతాం
- భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా నేత తిరుపతి నాయక్

**వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 మీ వార్త :**

**రేవల్లి మండలం న్యూస్ :** ఒకవైపు తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులు,మరోవైపు వేల లీటర్ల తాగునీరు రోడ్లపై వృథా! ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ నీరు వృథాగా పోతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామం కొత్త తండా నుంచి పాత తండాకు వెళ్లే ప్రధాన రహదారిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ సమస్య దీర్ఘకాలంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏడాదిగా లీకేజీ...రోడ్డుపై నీటి ప్రవాహం!**

కేశంపేట కొత్త తండా--పాత తండా మధ్య ప్రధాన రహదారిలో మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతినడంతో నీరు నిరంతరం లీకవుతూ రోడ్డుపై పారుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్య ఏడాది నుంచి రెండేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. లీకేజీ కారణంగా విలువైన తాగునీరు వృథా కావడమే కాకుండా, రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.









**ఫిర్యాదులు చేసినా స్పందనేది?**

పైపులైన్ లీకేజీ సమస్యపై రేవల్లి ఎంపీడీఓ, మిషన్ భగీరథ ఏఈతో పాటు సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశామని బీజేపీ గిరిజన మోర్చా నాయకుడు తిరుపతి నాయక్ తెలిపారు. వాట్సాప్ ద్వారా లీకేజీకి సంబంధించిన ఫొటోలను సైతం పంపించినా ఇప్పటివరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

**ప్రభుత్వ లక్ష్యం నీటి సంరక్షణ...అధికారుల నిర్లక్ష్యం వృథాకు కారణం!**

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోందని తిరుపతి పేర్కొన్నారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన పైపులైన్లకు మరమ్మతులు చేయకపోవడం వల్ల శుద్ధి చేసిన తాగునీరు రోడ్లపై వృథాగా పారిపోవడం బాధాకరమన్నారు. ఒకవైపు తండాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అందుబాటులో ఉన్న నీరు లీకేజీల రూపంలో వృథా కావడం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనమని విమర్శించారు.

**కలెక్టర్‌కు ఫిర్యాదు... స్పందించకుంటే ఆందోళన!**

ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టి, నీటి వృథాను నిలిపివేయాలని తిరుపతి డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించడంలో ఇంకా జాప్యం జరిగితే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అవసరమైతే తండా ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.విలువైన తాగునీరు వృథా కాకుండా చూడటం అధికారుల బాధ్యత. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టి ప్రజల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులకు నీటి వృథా కనిపించదా..? అధికారులకు వినిపించదా..? పైపులైన్ లీకేజీకి ఏడాది.. అధికారుల స్పందన ఏది? ప్రజాధనం నీళ్లపాలు.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం, తండాలకు తాగునీటి కష్టాలు.. రోడ్డుపై మాత్రం నీటి ప్రవాహం, ఫిర్యాదులు ఎన్నిసార్లు చేసినా ఫలితం శూన్యం, మిషన్ భగీరథ నీటి వృథాపై బీజేపీ నేత తిరుపతి ఆగ్రహం, లీకేజీకి మరమ్మతులు చేయండి,నీటి వృథాను అరికట్టండి అని మిషన్ భగీరథ నీరు రోడ్డుపాలు ఏడాదిగా పైపులైన్ లీకేజీ . ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు అని భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా తిరుపతి నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు...

# చిలుకానగర్ క్రైస్తవ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.25 లక్షల నిధులు మంజూరు

- పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు, క్రైస్తవ మత పెద్దలు

**చిలుక నగర్, అక్టోబర్ 13 ( మన మీ వార్త):**

చిలుకానగర్ డివిజన్ పరిధిలోని క్రైస్తవ శ్మశానవాటికలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయని చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషి, సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో శ్మశానవాటికలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో చిలుకానగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రాజేష్ ముదిరాజ్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డివిజన్‌లో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు





చేపడుతున్నట్లు తెలిపారు. తాజాగా క్రైస్తవ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.25 లక్షల నిధులు తీసుకురావడం అభినందనీయమన్నారు.

చిలుకానగర్ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డికి డివిజన్ ప్రజల తరఫున, క్రైస్తవ మత సంఘాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఆయనకు అందరూ అండగా నిలవాలని, ఐక్యంగా పనిచేస్తూ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిలుకానగర్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు స్వర్ణలత రూపోస్, ప్రధాన కార్యదర్శి మారపాక నాగయ్య పాల్, పాస్టర్లు జేమ్స్ రాజ్, కిరణ్ కుమార్, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు మారపాక సాయిలు, ఫ్రాన్సిస్, గాంధీ, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొంపల్లి బాలరాజ్, చిలుకానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్, ఏ బ్లాక్ అధ్యక్షురాలు అమరేశ్వరి, మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శ్రీరామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రఘు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, బి.ఎం. కిరణ్, రాంచర్ల బలరాం, కూరెల్లి యాదగిరి, జెర్రిపోతుల చంద్రయ్య, కొంద్ర రాములు, పగడం రామ నరసయ్య, రెబల్ భాస్కర్, మహిళా నాయకురాలు శోభ, యువజన అధ్యక్షుడు నవకాంత్ రెడ్డి, తిజ్జు థామస్, మహేందర్, ఓర్సు రాజు, ఆసిఫ్, గుగ్గిల రాములు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవములు మూడవ రోజు

**మన మీ వార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన తదుపరి అర్చకులు అమ్మవారిని గాయత్రిమాత గా అలంకరించారు. సాధనలో మూడవ మెట్టు మంత్రదీక్ష తీసుకోవడం సాధకుని యొక్క జాతకాన్ని పరిశీలించి ఏ మంత్రం సాధకుడికి బాగా ఉపకరిస్తుందో నాలుగైదు చక్రాలు వేసి మంత్ర దీక్ష ఇవ్వడం జరుగుతుంది. నాగాయత్ర్యాపరం మంత్రం నామాతు: పరదైవతం అని శాస్త్ర వచనం. సమస్త మంత్రముల స్వరూపమే గాయత్రి. గాయత్రి అమ్మవారిగా సేవింపబడుతున్న జగన్మాత దర్శనం వల్ల మంత్ర సిద్ధి కలుగుతుంది. అనగా మనం చేసే జపం, మనం చదివే చదువు ఒంటబట్టి ఉత్తీర్ణులవడానికి ఉపకరిస్తుంది. ఈ రోజు అమ్మవారికి ఉదయం చంద్రఘంటా క్రమంలో సింహవాహన సేవ సాయంకాలం మహిషమర్ధిని దుర్గా క్రమంలో గజవాహన సేవలిలో పూజారాధనలు జరిపారు. రాక్షసులతో యుద్ధం చేస్తున్న సందర్భంలో దిక్కులు పిక్కటిల్లేలా జగన్మాత చేసిన ఘంటానాదానికి అసురీ శక్తుల తలలు పగిలి పోయేవి. ఆ ఘంట కదిలకలు అర్ధ చంద్రాకారంలో ఉండటం వల్ల ఈమెకు చంద్రఘంటా అని పేరు వచ్చింది. చంద్ర ఘంటా క్రమంలోని అమ్మవారిని సేవించడం వలన సాధకుడిని పట్టి పీడిస్తున్న అసురీ శక్తులు దూరమైపోతాయి, మహిషమర్ధిని క్రమంలో ఆరాదింపబడిన అమ్మవారు సాధకుడిలోని దుర్మదములను అణచివేసి జాడ్యాన్ని తొలగించి సాధన నక్రమంగా కొనసాగేలా చేస్తుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు అమ్మవారి విశేష అలంకరణకు శ్రీ దొంతుల ప్రభాకర్ రెడ్డి అనిత దంపతులు, శ్రీ నామిరెడ్డి విక్రం రెడ్డి-చైతన్య దంపతులు మరియు శ్రీ కరణం ఫణిప్రసాద్- కాంచన దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయదాతలకు శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం మరియు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఆలయ ఈ ఓ శ్రీమతి రామల సునీత పర్యవేక్షించారు.



దేవాలయమును సందర్శించిన భక్తులందరికీ శ్రీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ శ్రీ అయితా గోపీనాథ్ అధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు.

ఈ రోజు హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్పాయ్ మాడవీధుల పురోగతిని పరిశీలించారు. అనంతరం దసరా నవరాత్రులలో నిర్వహించే అమ్మవారి రథోత్సవము నిర్వహించుటకు రథమును కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, కుడా మరియు ఇరిగేషన్ అధికారులు తదితరులున్నారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం మరియు కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ ఎం. హన్మంతరావు కుటుంబ సమేతంగా సందర్శించారు.





ఆలయానికి విచ్చేసిన కమీషనర్ గారికి ఆలయ ఈ.ఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, వేదపండితులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీ హన్మంతరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అనంతరం నవరాత్ర విశేష హారతులు వీక్షించారు. తదుపరి మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

రామల సునీత కార్యనిర్వహణాధికారి

# ఎల్‌నినోపై ముందస్తు కార్యాచరణ గ్రామాల వారీగా పంటల పరిస్థితిపై అంచనా వేయాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మన మీ వార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టరేట్‌లో మంగళ వారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరు తడి పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
గ్రామాల వారీగా పంటల పరిస్థితి, నీటి లభ్యతను అంచనా వేయాలని సూచించారు. పంటలు ఎండిపోయే



పరిస్థితులున్న గ్రామాలు, నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు.

వర్షపాతం, భూగర్భ జలాలు, సాగునీటి వనరుల లభ్యతపై సమగ్ర సమాచారం సేకరించి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు.

రానున్న వ్యవసాయ సీజన్‌లో నీటి ఎద్దడి ఏర్పడకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.

వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వాతావరణ అంచనాలను నిరంతరం పరిశీలిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సూచనలు అందించి పంట నష్టాన్ని నివారించేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యాన వన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డీఆర్డీవో నాగ పద్మజ, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలాజీ, సిపిఓ చంద్రకళ, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# మడికొండలో బీజేపీ జిల్లా కార్యదర్శి పొనగోటి వెంకట్ రావు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉచిత ఓటర్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.





**మన మీ వార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

రాబోయే వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని, వరంగల్ జిల్లా మడికొండ జంక్షన్‌లోని కార్యాలయంలో ఉచిత ఓటర్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శి పొనగోటి వెంకట్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవంలో బిజెపి రాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కో కన్వీనర్ దాస్యం అభినవ్ భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు గడ్డం మహేందర్ గార్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. విద్యావంతులు, యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలన్నారు. పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే మడికొండ జంక్షన్‌లో ఈ ఉచిత ఓటర్ నమోదు కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.
బీజేపీ జిల్లా కార్యదర్శి పొనగోటి వెంకట్ రావు మాట్లాడుతూ... మడికొండ పరిసర ప్రాంతాల్లోని పట్టభద్రులు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన పత్రాలతో వచ్చి తమ పేర్లను ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు చిన్నబోయిన శివ, బీజేవైఎం నాయకులు నిఖిల్ రావు, దార ధనుంజయ్, తాడం రంజిత్, గుండాల కళ్యాణ్, ఎలగొండ శివ, మిట్టపల్లి హేమంత్, నాయిని కుమార్, కొప్పిరాల సతీష్, పుల్యాల రవీందర్ రెడ్డి మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనాభా గణన రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి బల్దియా ప్రత్యేకాధికారి/హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**- ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం....**

**మన మీ వార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

జీడబ్ల్యూఎంసీ, 13 అక్టోబర్ 2026:జనాభా గణన రెండో దశను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి సంబంధిత నిబంధనలు, ప్రశ్నావళి, సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని బల్దియా ప్రత్యేకాధికారి/హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు.
మంగళవారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో నగర పరిధి లోని ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు జనాభా గణన రెండో దశపై అక్టోబర్ 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ శిక్షణలో భాగంగా మొదటి దశలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (నూూ) బ్లాకులను ఎన్యుమరేషన్ బ్లాకులుగా మార్చే విధానం, వెబ్ పోర్టల్






ద్వారా చేపట్టాల్సిన సాంకేతిక ప్రక్రియలు, ఎన్యుమరేషన్ బ్లాకుల కేటాయింపు, జనాభా గణనలో ఎవరూ మినహాయింపునకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

అలాగే, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించాల్సిన వివరాలతో పాటు మొదటిదశలో భాగం గా ఏమైనా లోపాలు సవరించడం తో పాటు ప్రశ్నావళిలోని కీలక అంశాలు, జనాభా వివరాల్లో లోపాలు లేదా వ్యత్యాసాలు ఉన్నప్పుడు వాటిని గుర్తించి సరిచేసే విధానాలపై అవగాహన కల్పించారు. కేటాయించిన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి వివరాలు సమగ్రంగా నమోదు అయ్యేలా చూడటంతో పాటు, జనాభా గణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సాంకేతిక వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సెన్సస్ విభాగం హైదరాబాద్ నుండి సీహెచ్ సతీష్, జూనియర్ టెక్నికల్ సూపర్ వైజర్ ప్రశాంత్ పాల్గొని, వెబ్ పోర్టల్ వినియోగం, బ్లాకుల మార్పులు, జనాభా వివరాల నమోదు తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఓ సత్యనారాయణ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ ఇసంపల్లి జోనా బల్దియా ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా. ఉపాధి హామీ ఉద్యోగులకు దసరా కానుక.

**- 3,800 మంది ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రాట్యుటీతో ఆర్థిక భరోసా.**

**- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.**

**మన మీవార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు.

ఉపాధి హామీ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 3,800 మంది ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నామని, గ్రాట్యుటీ కోసం ఉద్యోగులు సాగించిన 20 ఏళ్ల పోరాటానికి ఫలితం లభించిందని పేర్కొన్నారు. దసరా పండుగ వేళ తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు.
పదవీ విరమణ సమయంలో ఉద్యోగులకు కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ లభిస్తుందని, పదేళ్ల సర్వీసు పూర్తిచేసే ఉద్యోగులకు రూ.10 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. పదవీ విరమణ తర్వాత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.
ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి తెలిపారు. ఉద్యోగుల సేవలను గౌరవిస్తూ, వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు.

గ్రాట్యుటీ మంజూరుతో తమ 20 ఏళ్ల కల సాకారమైందని ఉద్యోగుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రాట్యుటీ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
PANCHAYAT RAJ & RURAL DEVELOPMENT (RD.I) DEPARTMENT
Read the following:
ORDER:
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
M.DANA KISHORE
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT
//FORWARDED :: BY ORDER//
SECTION OFFICER

# గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారునికి రూ. 1 లక్ష ప్రమాద బీమా అందజేత

**మన మీ వార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



**హనుమకొండ:** హనుమకొండలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుడు హనుమకొండకు చెందిన కుంటమల్ల గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి బ్యాంక్ ప్రమాద బీమా కింద మంజూరైన రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయల) పరిహారాన్ని డీఆర్‌డీవో (ఱ=ఱూ) మేన శ్రీను గారి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు.
ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యురాలు, నామినీ అయిన కుంటమల్ల స్వప్న గారికి బ్యాంక్ ప్రతినిధుల సమక్షంలో చెక్కు/పరిహార పత్రాన్ని అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా డీఆర్‌డీవో మేన శ్రీను గారు మాట్లాడుతూ... బ్యాంక్ ఖాతాదారులకు అందించే ఇలాంటి బీమా పథకాలు ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఎంతగానో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఖాతాదారుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అందిస్తున్న సేవలను మరియు సామాజిక బాధ్యతను ఆయన అభినందించారు.
ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మ్యాదరి సందీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు ప్రత్యేక నమోదు కు ప్రత్యేక శిబిరాలు

**- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**మన మీ వార్త అక్టోబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



భారత ఎన్నికల సంఘం (ఱఱ×) ఆదేశాల మేరకు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల ప్రకారం, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో స్థానం పొందేలా చూడటమే లక్ష్యంగా హనుమకొండ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం తెలిపారు.

ప్రధాన లక్ష్యం: "అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో చేర్చబడాలి మరియు అనర్హమైన పేర్లు ఏవీ ఉండకూడదు" అనేదే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశం.
లి ప్రత్యేక శిబిరాలు (ాజూవఏఖుశ్రీ ఖుఏజూం): హనుమకొండ జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో 15.10.2026 మరియు 16.10.2026 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయి.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

లి ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేనివారు (ావట్-శీట్ వశ్రీవక్షీశీం).

లి మొదటిసారి ఓటరుగా పేరు నమోదు చేసుకోదలచిన యువత / కొత్త ఓటర్లు.

చేయవలసిన విధానం: పైన పేర్కొన్న తేదీలలో అర్హులైన వారు తమ సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఫారం-6 (ఫీశీతీఎ-6) ద్వారా దరఖాస్తులను సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

అధికారుల అందుబాటుబాటు: ఈ ప్రత్యేక శిబిరాల సమయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (దీూాలు) మరియు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (దీూాలు) పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు.

అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాల్సిందిగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ కోరారు.
మరిన్ని వివరాల కోసం మీ ప్రాంతంలోని బూత్ స్థాయి అధికారులను (దీూా) లేదా హనుమకొండ జిల్లా ఎన్నికల విభాగాన్ని సంప్రదించగలరని తెలిపారు.

# బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి: మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్

**రామంతాపూర్, అక్టోబర్ 13 ( మన మీ వార్త):**



ఈ నెల 15న నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల ఏర్పాట్లపై బీజేపీ మహిళల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకురాళ్లు అంబటి భాగ్యలక్ష్మి, తాళ్ల మంగ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు జగన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని పూజిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేసి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో భోగాల అరుణ, సువర్ణ షిండే, వీణ, కీర్తి, శీలం సుధా, కొండేరు శ్రావంతి, విజేత, పారిజాతం, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# చురుకుగా సాగుతున్న జలసిరి పనులు

**అక్టోబర్13(మన మీవార్త తుంగతుర్తి ప్రతినిధి) :**



తిరుమలగిరి మండలం కోట్యా నాయక్ తండ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ రామోజీ నాయక్ ఆధ్వర్యంలో జలసిరి పనులను మంగళవారం నాడు చురుకుగా కొనసాగించారు, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిలువలను పెంపొందించేందుకే జలసిరి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని సర్పంచ్ రామోజీ నాయక్ అన్నారు తమ గ్రామంలో జలసిరి కార్యాక్రమం కింద కాలువ నిర్మాణ పను లు చేపడుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి సౌకర్యం కలుగుతుందని ఆయన అన్నారు.

# 45 రోజుల పాటు ఆర్ యూబి వన్ సైడ్ మూసివేత

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):





నిజామాబాద్ నగర లోని కంటేశ్వర్ రైల్వే అండర్ బ్రిడ్జీ దక్షిణ మధ్య రైల్వే డబుల్ ట్రాక్ వర్క్ చేపట్టడం మొదలు పెడుతున్నందున ఈనెల 16 నుంచి సుమారుగా (45) రోజుల వరకు వాహనాలు బయటకు వెళ్లడానికి ఉన్న ఆర్ యూబి వన్ సైడ్ మూసి వేస్తున్నట్టు పోలీస్ కమీషనర్ సాయి చైతన్య తెలిపారు. ఎన్టీఆర్ చౌరస్తా వైపు నుంచి జెడ్పి చౌరస్తా, కంటేశ్వర్ బైపాస్ వెళ్లే దారిలో ఒకవైపు గల రైల్వే అండర్పాస్ విస్తారణ పనులను కావున వాహనదారులు నిజామాబాద్ నగరం లోపలికి వచ్చే వాహనాలు ఆర్మూర్, నిర్మల్, అదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డి, హైదరాబాద్ వచ్చే వాహనాలు నేరుగా పాత దారి వెంబటే అనగా, కంఠేశ్వర్ బైపాస్, మీసేవ కంటేశ్వర్, ఒకవైపు పని పూర్తి అయిన రైల్వే అండర్ పాస్ గుండా ప్రయాణిస్తూ ఎన్టీఆర్ చౌరస్తా చేరుకొని అక్కడి నుండి కుడి చేతి వైపు తిరిగి రైల్వే స్టేషన్ ముందర నుంచి బస్టాండ్ చేరుకోవాలి అని తెలిపారు. నిజామాబాద్ నగరం నుంచి ఆర్మూర్, కరీంనగర్, అదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు దేవీ రోడ్డు రైల్వే ఫ్లై ఓవర్ ని ఉపయోగించి దుబ్బ శివాజీ స్టాచ్యూ, దుబ్బ రోడ్ లో ప్రయాణిస్తూ దుబ్బా చౌరస్తా ( శ్రీ మహాలక్ష్మి టెంపుల్ ) వద్ద ఎడమ చేతి వైపు మలిపి ఖానాపూర్ చౌరస్తా చేరుకోవాలన్నారు. అలాగే మహాలక్ష్మి టెంపుల్ దుబ్బ చౌరస్తా నుండి నేరుగా కూడా జిజి కాలేజ్ వద్ద యు టర్న్ దాకా వెళ్లి బైపాస్ నుండి కంటేశ్వర్ చౌరస్తా చేరుకోవాలన్నారు. హైదరాబాద్, కామారెడ్డి వెళ్లే వాహనదారులు ఎన్టీఆర్ చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా నుంచి మాధవ నగర్ రైల్వే గేట్ దాటుతూ మాధవ నగర్ బైపాస్ నుండి హైదరాబాద్ రోడ్డు చేరుకోవాలన్నారు. బోధన్, బాన్సువాడ, వర్ని వెళ్లే వాహనాలు యధావిధిగా పాత మార్గమునే అనుసరించి ప్రయాణం సాగించాలి. కావున నిజామాబాద్ నగర ప్రజలకు ఈ రైల్వే అండర్పాస్ పని సుమారుగా (45) రోజులు జరిగే అవకాశం ఉన్నందున పై తెలిపిన దారులను ఉపయోగించుకొని పట్టణంలోనికి రావడం, నగరం నుంచి బయటకు పోవడం కొనసాగించాలని సీపీ సూచించారు.

# బాసర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

- గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా, అక్టోబర్ 13 (మన మీ వార్త) :



బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

మంగళవారం బాసరలో పర్యటించిన కలెక్టర్, ముందుగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను జాగ్రత్తగా తొలగించాలని సూచించారు. ఆలయ నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి నది తీరంలోని పుష్కర ఘాట్లను పరిశీలించి, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని, వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖల ఈఈలు సుభాష్, అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కట్లపాము కరిచిన బాలుడిని రక్షించిన జీజీహెచ్ వైద్యులు

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):



కట్లపాము కాటుకు గురై తీవ్ర నరాల సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడుతున్న 9 ఏళ్ళ బాలుడికి నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు పునర్జన్మనిచ్చారు. మంగళవారం నిజామాబాద్ జీజీహెచ్ లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాములు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డా.రాములు కథనం ప్రకారం ఈ నెల 5న కామారెడ్డి జిల్లా బాన్సువాడలో అజాన్ అనే 9 ఏళ్ళ బాలుడిని కట్లపాము కాటు వేసింది. ముందుగా బాలుడిని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం 6న జీజీహెచ్ కు రిఫర్ చేశారు. నిజామాబాద్ జీజీహెచ్ లోని పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో బాలుడికి తీవ్ర నరాల సంబంధించిన ప్టోసిస్, మాటలు స్పష్టంగా రాకపోవడం లాంటి సమస్యలతో పాటు శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. తక్షణమే స్పందించిన పిల్లల వైద్య నిపుణులు 20 వైల్స్ యాంటి స్నేక్ వెనం అందించడంతో పాటు ఆట్రోపిన్, నియోస్టిగ్మిన్ చికిత్సను అందించారు. శ్వాస సంబంధిత సమస్య ఎక్కువగా కావడంతో వెంటి లెటర్ పై నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు. మూడు రోజుల తర్వాత ఫలితం కనిపించడంతో బాలుడికి వెంటి లెటర్ తొలగించారు. ప్రస్తుతం బాలుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఆజాన్ కు అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడడంలో పిడియాట్రిక్ ప్రొఫెసర్లు శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కీర్తి, వారి టీం చేసిన పని పట్ల ప్రశంసించారు. జీజీహెచ్ లో అత్యవసర వైద్య సేవల్లో ప్రైవేట్ కు ఏ మాత్రం తీసిపోకుండా సేవలందిస్తున్నామని డా.రాములు తెలిపారు.

# నగరంలో అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం : ఎమ్మెల్యే ధన్‌పాల్

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):



అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నగరంలోని 50, 7, 20వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు.

**ప్రతి డివిజన్ కు రూ.20లక్షలు**

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ లో ప్రతి డివిజన్ కు రూ.20లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని డివిజన్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తామని తెలిపారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ కోసం కూడా ఇప్పటికి అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. తొందర్లోనే డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే డివిజన్?కు రూ. కోటి పనులు కూడా కొన్ని డివిజన్లో ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు.

**అమృత్--2 పథకం కింద..**

అమృత్--2 పథకం కింద నగరంలో యూజీడీ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగరంలో నూతనంగా 9 వాటర్ ట్యాంకుల నిర్మాణం జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నీటి ఎద్దడి లేకుండా పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. అలాగే ఇందూరులోనే ఘన చరిత్ర ఉన్న అతి పురాతనమైన ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కూడా రాబోతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, 50వ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ కులకర్ణి, 7వ డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, 20వ డివిజన కార్పొరేటర్ న్యాలం సునీత, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దసరా నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 13, ( నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



దసరా పండుగ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ టౌన్-1 సీఐ బి. శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

**ఆభరణాల విషయంలో అప్రమత్తత అవసరం**

పండుగ సమయంలో విలువైన బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ అన్నారు. అవసరానికి మించి ఆభరణాలను ధరించి రద్దీగా ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లేటప్పుడు ఇంటి తలుపులు, కిటికీలు సక్రమంగా మూసి తాళాలు వేయాలని.. ఇంట్లో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఉంచకూడదని పేర్కొన్నారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో వీలైతే సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

**వాహనాల భద్రత..**

ద్విచక్ర వాహనాలు, కార్లను పార్కింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా తాళాలు వేయాలన్నారు. బ్యాగులు, ఇతర విలువైన వస్తువులను వాహనాల్లో వదిలి వెళ్లకూడదని సీఐ తెలిపారు. దసరా ఉత్సవాలు, దేవాలయాలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ వంటి రద్దీ ప్రాంతాల్లో పర్సులు, మొబైల్ ఫోన్లు, నగలు భద్రంగా ఉంచుకోవాలని.. దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పండుగ వేడుకలకు పిల్లలను తీసుకెళ్లేటప్పుడు వారిని నిరంతరం గమనిస్తూ ఉండాలని.. రద్దీ ప్రాంతాల్లో పిల్లలు తప్పిపోకుండా అప్రమత్తంగా చూసుకోవాలని వివరించారు.

## భద్రమారుతి, గృష్ణేశ్వర్ వెళ్లిన నిర్మల్ యాత్ర బస్సు

నిర్మల్ జిల్లా అక్టోబర్ 13 (మన మీ వార్త ) :



ఆర్టీసీ నిర్మల్ డిపోనుండి భద్ర మారుతి, గృష్ణేశ్వర్ కు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే పండరి తెలిపారు.

ఈ బస్సు 13 అక్టోబర్ రోజు వెళ్లి ఔండా నాగనాథ్ జ్యోతిర్లింగం దర్శించుకొని 14 తేదీ భద్ర మారుతీ, గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగం దర్శించుకొని ఎల్లోర గుహలు వీక్షించి అక్కడ శివాలయం దర్శించుకొని ఔరంగా బాద్ లో గల మిని తాజమహల్ బిబికా ముక్బరా చూసి తిరిగి 15 వ తేదీ ఉదయం 4 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని ఆయన తెలిపారు.

నిర్మల్ పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రయాణికుల ఆధారాభిమాణాలతో 27 అక్టోబర్ రోజు 6 జ్యోతిర్లింగాలు గుజరాత్ యాత్ర బస్సు పెట్టడం జరిగిందని ఇంతకు ముందే 6 జ్యోతిర్లింగాలు పెట్టడం జరిగింది.ప్రయాణికులు చాలా ఆదరించారు.మళ్ళీ 27అక్టోబర్ రోజున మధ్యాహ్నం 1:30 ని!! లకు పెట్టడం జరిగింది.దానిలో ఇంకా 10 సీట్లు మిగిలి ఉన్నాయి ఆసక్తి కలవారు ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.
మరిన్ని వివరాలకు
9959226003,9440018549 లో సంప్రదించాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయించాలి- కలెక్టర్

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



కస్తూర్బా గాంధీ విద్యాలయాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలలో అసంపూర్తి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్?లో మంగళవారం ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు.

**కేజీబీవీల్లో నూతన భవనాలు..**

కేజీబీవి పాఠశాలల్లో నూతన భవన నిర్మాణాలు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, డ్రైనేజీల నిర్మాణ ప్రగతిని సమీక్షిస్తూ, పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు మంజూరీలు లభించని పక్షంలో వీబీ జీరాంజీ కింద ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎంఎస్?వోలు, ఎంఈవోలు ప్రతీ నెలా కనీసం రెండు పర్యాయాలు కేజీబీవీలను ఆకస్మికంగా సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. బాలికలకు పరిశుభ్రమైన నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యాసంస్థల పరిసరాలు, ఆవరణ పరిశుభ్రంగా ఉండాలన్నారు. ముఖ గుర్తింపు విధానం (ఎఫ్ఆర్ఎస్) నూటికి నూరు శాతం అమలు చేయాలని, లేనిపక్షంలో జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు.

## ఎల్‌నినో ప్రభావంతో పెరిగిన విద్యుత్ డిమాండ్

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా నిజామాబాద్ సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగం సాధారణ పరిస్థితుల కంటే ఎక్కువగా ఉందని టీజీఎన్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ పి.వి.రాజేశ్వర్ రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

**వినియోగం, డిమాండ్ గణాంకాలివే..**

2025తో పోలిస్తే 2026 జూలై, ఆగస్టులలో విద్యుత్ వినియోగం 3.53శాతం పెరగగా, సెప్టెంబర్‌లో 53.83శాతం, అక్టోబర్ 1--12 మధ్య ఏకంగా 68.01శాతానికి పైగా పెరిగింది. సెప్టెంబర్‌లో గరిష్ఠ డిమాండ్ 767 మెగావాట్లకు చేరింది. అక్టోబర్‌లో రోజువారీ వినియోగం గత ఏడాదితో (6.38 మిలియన్ యూనిట్లు) పోలిస్తే 11.25 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఈ సందర్భంగా ఆయా డివిజన్, సర్కిల్, కార్పొరేట్ స్థాయిల్లో నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, నోడల్ అధికారులను నియమించామని ఎస్?ఈ తెలిపారు.

**2027 వేసవి ప్రణాళిక..**

వచ్చే వేసవి డిమాండ్‌ను తట్టుకోవడానికి ముందస్తుగా 4 కొత్త సబ్‌స్టేషన్లు, 10 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 468 డిటీఆర్‌లు, 28 కెపాసిటర్ బ్యాంకులు, కొత్త ఫీడర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎస్‌ఈ తెలిపారు. సాంకేతిక లోపాలు తలెత్తకుండా వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ ప్రాధాన్యత అని ఆయన వివరించారు.

## దేవాపూర్‌లో అదనపు కలెక్టర్ తనిఖీ

- గ్రామ పంచాయతీ రికార్డులు, పారిశుద్ధ్య పనుల పరిశీలన



కాసిపేట, అక్టోబర్ 13 (మన మీ వార్త మండల ప్రతినిధి) :

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య మంగళవారం సందర్శించి వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు.

అనంతరం ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తమకు కేటాయించిన ఎస్ఐఆర్ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పశు వైద్యశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న వీఓ భవనాలను తనిఖీ చేశారు. ఈ-పంచాయతీ పోర్టల్‌లో నిరుద్యోగ యువత నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి ధ్రువీకరణ ప్రక్రియను సమీక్షించారు. గ్రామంలో ఇంటి పన్నుల అంచనా, పన్నుల వసూళ్లకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్ పాండే, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సిడాం రాందాస్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ అధికారులు (జీపీఓలు), బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పాల్గొన్నారు.

## కాసిపేట ప్రధాన రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

- దుమ్ము ధూళితో ప్రజలకు ఇబ్బందులు.. పనులు పూర్తయ్యే వరకు దుమ్ము నివారణ చర్యలు చేపట్టాలి



కాసిపేట, అక్టోబర్ 13 (మన మీ వార్త మండల ప్రతినిధి) :

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై దుమ్ము ధూళి విపరీతంగా ఎగసిపడుతుండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుమ్ము ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు దుమ్ము కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, అప్పటివరకు రహదారిపై దుమ్ము తగ్గించేందుకు క్రమం తప్పకుండా నీటిని చల్లడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మంచిర్యాల జిల్లా కన్వీనర్ సంకె రవి, టీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జి సోదారి సురేష్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి దుర్గం సుధాకర్, వార్డు సభ్యులు రాంబాబు, నిచ్చకోల్ల శంకర్, స్వామి, రత్నం సుధాకర్, సల్లూరి కిరణ్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పెండింగు భూముల బకాయిని చెల్లించాలని అధికారులను అడ్డుకున్న రైతులు

పరకాల ప్రతినిధి మన మీ వార్త :



హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారం వెల్లంపల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పెండింగ్లో ఉన్న భూముల్లో రోడ్డు పనులు ప్రారంభించేందుకు వచ్చిన నేపథ్యంలో భూ నిర్వాసితులకు సంబంధిత



అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది సరైన పరిహారం అందించకుండా నుంచి రోడ్డు ఎలా వేస్తారు, అంటూ భూ నిర్వాసి రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట చేతికొచ్చే సమయంలో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.పంట నష్టపరిహారం అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.రైతులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నప్పటికీ పచ్చని పంట పొలాల్లో నుంచి రోడ్డు పనులను కొనసాగించడం పట్ల స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం అందిస్తామని రైతులకు చెప్పి సంబంధిత అధికారులు పంటలను తొలగించి రోడ్డు పనులను ప్రారంభించారు.

## ఇందిరా నగర్‌లో ఘనంగా గ్యార్వి షరీఫ్ ఉత్సవాలు

- ఉత్సవాల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నాచారం, అక్టోబర్ 13 ( మన మీ వార్త) :

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హెచ్ఎంటి నగర్ డివిజన్, ఇందిరా నగర్‌లో నిర్వహించిన గ్యార్వి షరీఫ్ ఉత్సవాల్లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక బిఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గ్యార్వి షరీఫ్ ఉత్సవాల ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, ప్రజలందరూ పరస్పర గౌరవం, సోదరభావం, శాంతి సామరస్యాలతో కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం మత సామరస్యానికి, ప్రజల మధ్య ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. స్థానిక నాయకులు, నిర్వాహకులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో కాంగ్రెస్ నేతలపై లాఠీఛార్జిను ఖండించిన పన్యాల జైపాల్ రెడ్డి

**ఎల్బీనగర్ :** ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి గాయాలు కావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీఛార్జి చేయడం ఆందోళనకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పన్యాల జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# అమీన్‌పూర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

పటాన్ చేరు అక్టోబర్ 13 మీ వార్త ప్రతినిధి :

- ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో ఉత్సాహంగా వేడుకలు..
- మహిళలు ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధించుకోవచ్చు
- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు మల్లు లక్ష్మి..



అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ పరిధిలోని బీరంగూడ భ్రమరాంబిక నగర్ కాలనీలో సీఐటీయూ, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ జోష్ నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. పూలను పూజించే సంస్కృతి మనదనీ, పండుగ వేళల్లో మహిళలంతా ఇష్టంతో ఒకచోట చేరి తమ కష్టసుఖాలను పంచుకోవడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. నేటి సమాజంలో మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అయితే మహిళలపై పెరుగుతున్న వేధింపులు, సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. చైతన్యవంతమైన మహిళలతోనే సమాజంలో మార్పు సాధ్యమని, హక్కుల సాధన కోసం ఐద్వా, సీఐటీయూ అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నాయిని లలిత, ప్రధాన కార్యదర్శి సునీత, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, సీఐటీయూ నాయకులు నర్సింహారెడ్డి, జార్జ్, శ్రీనివాస్ రెడ్డి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు భ్రమరాంబిక నగర్ కాలనీ మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు.

# పరకాల జిల్లా హోదాపై బహిరంగ చర్చకు సిద్ధం

- బీఆర్ఎస్ నేతలు తేదీ, సమయం ప్రకటించాలి
- బీఆర్ఎస్ కు సవాల్ విసిరిన బీజేపీ నాయకుడు- ఆకుల శ్రీధర్

పరకాల ప్రతినిధి మన మీ వార్త అక్టోబర్ 13 :

**హనంకొండ జిల్లా పరకాల:**బీఆర్ఎస్ నాయకులు బీజేపీని విమర్శించే ముందు పదేళ్ల పాలనలో పరకాలకు జిల్లా హోదా ఎందుకు కల్పించలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆకుల శ్రీధర్ డిమాండ్ చేశారు.

పరకాల అభివృద్ధి, జిల్లా హోదా అంశాలపై బీఆర్ఎస్ నాయకులు సిద్ధంగా ఉంటే తేదీ, సమయం, స్థలం ప్రకటించి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

తెలంగాణలో 33 జిల్లాలను ఏర్పాటు చేశామని చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులు.. చారిత్రక నేపథ్యం కలిగిన పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించడంలో ఎందుకు విఫలమయ్యారో వివరించాలని డిమాండ్ చేశారు.



రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం పొందిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, జిల్లాల పునర్విభజన సమయంలో పరకాల ప్రజల ఆకాంక్షను ఎందుకు నెరవేర్చలేకపోయారో చెప్పాలన్నారు.

పరకాలకు జిల్లా హోదా వస్తుందని వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ డివిజన్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ జిల్లా హోదాపై ప్రశ్నలకు సమాధానాలు దాటవేయడం సరికాదన్నారు.

కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తే పరకాలకు జిల్లా హోదా వస్తుందా? అని ప్రశ్నించారు.

**అభివృద్ధిపై ఆధారాలతో చర్చిద్దాం**

పరకాల జిల్లా హోదా, ప్రభుత్వ ఆసుపత్రి, విద్యా సదుపాయాలు, రహదారులు, ఇతర అభివృద్ధి పనులపై గత పాలనలో సాధించిన ఫలితాలు, నెరవేరని హామీలను ప్రజల సమక్షంలో ఆధారాలతో చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆకుల శ్రీధర్ తెలిపారు. బీజేపీని విమర్శించే ముందు పరకాలకు జిల్లా హోదా ఎందుకు తీసుకురాలేకపోయారో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరకాల ఆత్మగౌరవం కోసం, అమరవీరుల జిల్లాగా గుర్తింపు సాధించే లక్ష్యంతో ప్రజల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఘనంగా మండలి ప్రతిపక్షనేత సిరికొండ' జన్మదినం వేడుకలు

పరకాల ప్రతినిధి మన మీ వార్త జననిర్ణయం /కొత్తపల్లి గోరి (అక్టోబర్ 13) :

భూపాలపల్లి జయశంకర్ జిల్లా బీఆర్ఎస్ నియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు మంగళవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో రేగొండ మాజీ ఎం పీపీ ఈర్ల సదానందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది..

ఈ సందర్భంగా ఈర్ల సదానందం మాట్లాడుతూ తెలంగాణ రాజకీయాల్లో విశిష్టమైన గుర్తింపుపొందిన నాయకులు, తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, ప్రజాసేవకు అంకితమైన నాయకులు సిరికొండ మధుసూదనాచారి గారి జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని. తెలంగాణ రాష్ట్ర సాధన



ఉద్యమంలోనూ రాష్ట్ర రాజకీయ ప్రస్థానంలోనూ తనదైన పాత్ర పోషించిన మధుసూదనాచారి ప్రజాజీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారని ఎమ్మెల్యే గా, శాసనసభ స్పీకర్గా ఆయన అందించిన సేవలు తెలంగాణ రాజకీయ చరిత్రలో ప్రస్తావించదగినవని. ప్రజల సమస్యలను అర్థం చేసుకుంటూ, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ,తెలంగాణ అభివృద్ధి కోసం మరింతగా సేవలందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షిస్తున్నామని తెలియజేశారు..

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కానుగంటి శ్రీనివాస్, దండెబోయిన. సంతోష్, మంతెన మహేందర్,ఆవాల బుచ్చారావు,లెంకలపెల్లిసంతోష్,కాశబోయినసంతోష్,ఎడ్డె రాజ్ కుమార్, రఘుసాల వీరన్న, బొమ్మకంటి శ్రీను, ఒంటేరు శివ, జూపాక మహేందర్,బొమ్మకంటి అరవింద్, గడ్డం లింగయ్య, గడ్డం సారంగపాణి తదితరులు పాల్గొన్నారు..

# సర్పంచ్ నవ్య నాగరాజు గౌడ్ పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో సాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ.

మనోహరాబాద్ అక్టోబర్ 13 మన మీ వార్త ప్రతినిధి :





మండల పరిధిలో మేజర్ గ్రామపంచాయతీ కాళ్ళకల్ గ్రామంలో తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ గ్రామ సర్పంచ్ నవ్య నాగరాజుగౌడ్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మరియు బంగారమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా విగ్రహ ఆవిష్కరణ జరపడం మహిళా సర్పంచి ఉండడంతో ఒక మహిళ విగ్రహం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉండాలని ఆనందం వ్యక్తం చేశారు.భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, పోరాడిన వీర వనిత అని సర్పంచ్ నవ్య భూమికోసం భక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనితని ప్రస్తుత సమయంలో ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి విషయంలో మన వంతు ప్రతి సమస్యపై నిలదీసి ప్రజల కోసం పోరాటం చేయాలని



తెలియజేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో ఆమె వంతు కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు.

జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండడుగులను పోలీస్ అధికారులు గుర్తించి వెంటనే వారిపై తగిన చర్య తీసుకోవాలని హెచ్చరించారు తెలంగాణలో అక్కడక్కడ కొన్ని విగ్రహాలను కూల్చివేయడం గత ప్రభుత్వంలో కూడ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని గుర్తు చేశారు ఈ ప్రభుత్వంలో కూడా విగ్రహాలపై పోలీసులది ఎలాంటి భద్రతా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు కూల్చివేసిన దుండగులపై వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అలాగే ప్రభుత్వాన్ని పాలించే నాయకులకు కూడా బాధ్యత వహించాలనిగుర్తు చేశారు ప్రభుత్వ నాయకులు తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

-తూప్రాన్ మనోరబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదంశెట్టి వెంకటేష్ గుప్తా

ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే విగ్రహాల కూల్చివేత జరుగుతుందని దీనిపై పోలీసు యంత్రాంగం విచారణ జరిపించి విగ్రహాన్ని కూల్చివేసిన దున్నడుగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామ వివిధ సంఘాల యువకులు అన్ని పార్టీల నాయకులు అభిమానులు మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. అన్నదానం నిర్వహించారు.

## బంగ్లాదేశ్ బిచ్చగాడు.. 21 మంది భార్యల అసలు స్టోరీ ఇదే!




ఎందుకు.. ఏమిటి.. ఎలా..? అన్న మూడు ప్రశ్నల్ని వేసుకోవటం ద్వారా.. విషయం ఏదైనా మరిన్ని విషయాలు తెలుసుకునే అవకాశాన్ని ఇస్తోంది. తాజాగా ప్రముఖ మీడియా సంస్థల నుంచి సోషల్ మీడియా వరకు.. ఒక వార్త విపరీతంగా హైలెట్ అవుతోంది. బంగ్లాదేశ్ కు చెందిన బిచ్చగాడికి 21 మంది భార్యలు ఉన్నట్లు.. అతగాడు తన 21 మంది భార్యల పేర్లలో ఎనిమిది మంది పేర్లు మాత్రమే చెప్పటం.. మిగిలిన వారి పేర్లు గుర్తు లేదని చెప్పినట్లుగా కథనం పబ్లిష్ అయ్యింది. అంతేకాదు.. తన దగ్గర ప్రత్యేకత ఏమిటో తనకు తెలీదని.. తన వద్దకు వచ్చి పెళ్లి చేసుకుంటామని కోరుకున్నందున.. వారిని నొప్పించటం ఇష్టం లేక తాను వాళ్లను పెళ్లి చేసుకున్నట్లుగా సదరు కథనాలు చెబుతున్నాయి.
మరి నిజం ఏంటి? అసలు విషయం మరేంటి? ప్రపంచంలో ఏ దేశమైనా స్త్రీ.. పురుషుల మధ్య సంబంధాలు.. అంతా తనకే సొంతమనుకునే జీవితభాగస్వామి విషయంలో సహజ సిద్ధంగా ఉండే ఆసూయ.. అభద్రతాభావం ఏ మహిళలో అయినా ఉంటుంది. ఇందుకు మినహాయింపు చాలా అరుదు. అందునా ఒకప్పుడు భారతదేశంలో భాగం.. ఆ తర్వాత పాకిస్తాన్ లో భాగమై.. తదనంతర దశల్లో ఒక దేశంగా మారిన బంగ్లాదేశ్ లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉండే అవకాశం అస్సలు ఉండదు. అందునా.. ఒక పూరి గుడిసెలో నివసించే 35 ఏళ్ల మోరు మియా తన 21 మంది భార్యల కథ వినేందుకు విడ్డూరంగా ఉండటం.. దానికి ప్రముఖ మీడియా సంస్థలు సైతం కథనాలు పబ్లిష్ చేయటం చూసినప్పుడు.. ఎక్కడో.. ఏదో తేడా కొట్టినట్లుగా అనిపించటం ఖాయం. అందుకే వార్తల్లో వ్యక్తిగా మారిన ఒక బిచ్చగాడి విషయాన్ని మరింత లోతుల్లోకి వెళ్లే ప్రయత్నం చేసినప్పుడు షాకింగ్ అంశాలు ఎదురయ్యాయి.

# శబరిమలలో ఫొటోగ్రఫీ, డ్రోన్లపై బ్యాన్

శబరిమల మండల–మకరవిళక్కు సీజన్ నేపథ్యంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శబరిమల, పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా పలు కఠినమైన ఆంక్షలు విధిస్తూ పథనంతిట్ట జిల్లా కలెక్టర్ ఎ. నిజాముద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డ్రోన్లపై నిషేధంతో పాటు మాంసాహారం, హోటళ్లపైనా ఆంక్షలు విధించారు.



### ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై పూర్తి నిషేధం

శబరిమల సన్నిధానం, పంబ, నిలక్కల్ ప్రాంతాల్లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై జిల్లా కలెక్టర్ పూర్తి నిషేధం విధించారు. సన్నిధానంలోని నలంబలం లోపల భక్తులు విచ్చలవిడిగా కెమెరాలు, మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల దర్శనానికి తీవ్ర ఆటంకం కలుగుతోందని, దీనివల్ల తోపులాటలు జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది, భద్రతా అధికారిక అవసరాల కోసం చేపట్టే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీకి ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపింది.

### డ్రోన్ల వినియోగంపై పూర్తి నిషేధం

దీంతో పాటు యాత్రా సీజన్‌లో సన్నిధానం, పంబ, నీలక్కల్ సహా అటవీ ప్రాంతాల్లో అనధికారిక అవసరాల కోసం డ్రోన్ల వినియోగంపై పూర్తి నిషేధం విధించింది. జిల్లా పోలీస్ చీఫ్ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే అధికారిక అవసరాల కోసం డ్రోన్‌లను ఉపయోగించడానికి భద్రతా సంస్థలకు అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. సన్నిధానం, పంబ, నీలక్కల్ సహా చుట్టుపక్కల అటవీ ప్రాంతాలు అత్యంత సున్నితమైనవి. ఉత్సవ సమయంలో ఈ ప్రాంతాలకు భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఇలాంటి ప్రాంతాల్లో అనుమతి లేకుండా డ్రోన్‌లను నడపడం భక్తుల భద్రతకు, గోప్యతకు తీవ్ర ముప్పు కలిగిస్తుంది. అంతేకాకుండా డ్రోన్‌లు భద్రతా వ్యవస్థకు తీవ్ర సవాలుగా మారడంతో పాటు అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని అధికారులు తెలిపారు.

### యాత్రా మార్గంలో అనధికారికంగా రోడ్డు పక్కన వ్యాపారం చేయకూడదు

ఇంకా నవంబర్ 11 నుంచి 2027 జనవరి 25 వరకు పంబ నుంచి సన్నిధానం వరకు ఉన్న యాత్రా మార్గంలో అనధికారికంగా రోడ్డు పక్కన వ్యాపారం చేయడాన్ని నిషేధించింది. వడసేరికర నుంచి అత్తతోడు వరకు ఉన్న మార్గాల పక్కన పశువులను కట్టేయడం, మేపడాన్ని కూడా కలెక్టర్ నిషేధించారు. అదనంగా యాత్రా సమయంలో లాహ– సన్నిధానం మధ్య నడిచే హోటళ్లలో ఒకేసారి నిల్వ చేయగల గ్యాస్ సిలిండర్ల గరిష్ట సంఖ్యను ఐదుకు పరిమితం చేశారు. ప్రజలు సంచరించే ప్రదేశాల్లో ప్రమాదకరమైన రీతిలో గ్యాస్ సిలిండర్లను నిల్వ చేయడాన్ని నిషేధించింది.

### మాంసాహారాన్ని నిల్వ చేయడం, వండటం, అమ్మడంపైనా ఆంక్షలు

ముఖ్యంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి శబరిమలకు వెళ్లే రహదారుల పక్కన, నీలక్కల్ వద్ద, ఇతర పార్కింగ్ స్థలాల్లో నిలిపి ఉంచిన వాహనాల దగ్గర వంట చేయడాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ సమయంలో లాహ నుంచి సన్నిధానం వరకు ఉన్న యాత్రా మార్గాల్లో ఉన్న హోటళ్లు మాంసాహారాన్ని నిల్వ చేయడం, వండటం, అమ్మడంపైనా ఆంక్షలు విధించారు.

### మండల యాత్రకు విస్తృత ఏర్పాట్లు

మండల యాత్ర ప్రారంభానికి కేవలం కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో జిల్లా యంత్రాంగం ఈ నిబంధనలను కఠినతరం చేసింది. భక్తులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తూనే, భద్రతా విషయాల్లో ఎటువంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. శబరిమల, దాని పరిసర ప్రాంతాల్లో వివిధ శాఖల సమన్వయంతో విస్తృతమైన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పర్యావరణ అనుకూల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, సురక్షితమైన యాత్రను సులభతరం చేయడమే జిల్లా యంత్రాంగం యొక్క అంతిమ లక్ష్యమని అధికారులు చెప్పారు.

# లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే

లద్దాఖ్ విషయంపై చైనా చేస్తున్న వాదనలను భారత్ గట్టి బదులిచ్చింది. లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేసింది. చైనా వైపు నుంచి ఎన్ని తిరస్కరణలు వచ్చినా ఈ వాస్తవాన్ని మార్చలేవని గట్టిగా సమాధానం ఇచ్చింది. లద్దాఖ్?లోని 28 వ్యూహాత్మక ప్రాంతాల పేర్లను భారత్ అధికారికంగా ప్రామాణీకరించడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ దౌత్యపరమైన వివాదం చెలరేగింది. అయితే, చైనా చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తీవ్రస్థాయిలో స్పందించారు. "కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు సంబంధించి సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లలో చేర్చిన ఈ భౌగోళిక పేర్లను లద్దాఖ్ పరిపాలనా విభాగం, స్థానిక ప్రజలు, వాటాదారులతో సుదీర్ఘంగా సంప్రదింపులు జరిపిన తర్వాతే ఖరారు చేశాం. ఈ ప్రదేశాలను అధికారిక మ్యాప్‌లలో స్పష్టంగా గుర్తించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. అలాగే, ఆయా ప్రాంతాలను కచ్చితంగా గుర్తించడానికి వీలవుతుంది."

### భారత్ తీసుకున్న ఈ చర్య చట్టవిరుద్ధం: చైనా

మరోవైపు, లద్దాఖ్?లోని ప్రదేశాలు, భౌగోళిక లక్షణాలకు ప్రామాణిక పేర్లను కేటాయించాలన్న భారత నిర్ణయాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని చైనా ఎన్నడూ గుర్తించలేదని పేర్కొంది. అలాగే, భారత్ ప్రచారం చేస్తున్న ప్రామాణిక పేర్లను సైతం గట్టిగా వ్యతిరేకించింది. ఈ మేరకు



బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మంగళవారం బీజింగ్‌లో మీడియాతో మాట్లాడారు. "భారత్ తీసుకున్న ఈ చర్య చట్టవిరుద్ధం. చైనా– భారత్ సరిహద్దులోని పశ్చిమ భాగం చైనాకు చెందినది అనే వాస్తవాన్ని ఇది మార్చదు. ఈ నిర్ణయం వల్ల సరిహద్దు ప్రాంతాలపై మా వైఖరి మారదు"అని పేర్కొన్నారు.

### అసలేం జరిగింది

లద్దాఖ్‌లోని కీలక ప్రాంతాలను భారత అధికారిక మ్యాప్‌లో గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 2న నిర్ణయం తీసుకుంది. ఆ జాబితాలో లద్దాఖ్‌లోని 28 కీలక ప్రాంతాలు, పర్వతాలు, లోయలు, మంచు కొండలు, పర్వత మార్గాలకు భారత్ పేర్లు ఖరారు చేసింది. కేంద్ర హోం శాఖ, లద్దాఖ్ పాలన యంత్రాంగం సంయుక్తంగా ఈ చర్యలు తీసుకున్నాయి. ఆ జాబితాలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. తూర్పు లద్దాఖ్?లో భారత్, చైనా మధ్య 2020లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడిన నేపథ్యంలో అదే ఏడాది మే 5న పాంగాంగ్ సరస్సు ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఇరుదేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగాయి. అయితే, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇరు దేశాలు చర్చలు జరిపాయి. 2022లో కొన్ని ప్రాంతాల్లో సైనిక బలగాలను వెనక్కి తీసుకునే ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి ప్రాంతాలకు ప్రాధాన్యం ఉంది. సరిహద్దులో ఎక్కడెక్కడ కీలక ప్రాంతాలు ఉన్నాయో స్పష్టంగా గుర్తించడం భారత సైనిక గస్తీకి, అధికారిక రికార్డుల నిర్వహణకు ఉపయోగపడుతుంది.

గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ ప్రాంతాలు వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి భారత సైన్యం గస్తీ నిర్వహించడానికి కీలకంగా ఉంటాయి. వీటిలో అలీషా గిరి, బ్రంగ్సా, చాప్చింగల్ పాస్, కనిష్క శిఖరం, కరుణ్ పీర్ పర్వతం, కుక్సెల్, మార్తాండ్ గిరి, పర్ఫిక్ హిమానీనదం, స్క్రామి హిమానీనదం, షాచ్మిరిక్ పాస్, షోక్ర్గా వ్యాలీ, జోరావర్ శిఖరం, డెప్రో కంపాస్, డ్రాక్ కార్పో, జోల్మోరి, జ్బెనాంగ్, కుమారాయనా పాలింట్, పాన్‌కియాంగల్ ఉన్నాయి. గిరి, గురు రిన్‌పోచే, షామల్ లుంగ్‌పా, యాంగ్‌పా నది, మార్ప లోత్సవ రి, మిలరేప కాంగ్రి, శివ రి, మహేశ్వర రి ప్రాంతాలు ఉన్నాయి.

# దేశ ప్రజలంతా మాతో ఉన్నారు

లదేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం విపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాలు ఏకతాటిపై నిలబడి ఐక్యపోరాటం చేస్తున్నట్లు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఆయన తన నివాసంలో 'ఇండీ' కూటమి నేతలకు, పౌర, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ, ఓటు చోరీకి బాధ్యులైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జజుజ జ్ఞానేశ్ కుమార్‌ను కోర్టు ముందు నిలబెట్టడమే ప్రతిపక్షాల లక్ష్యమన్నారు. సుప్రీం కోర్టుతో పాటు ప్రధాన న్యాయమూర్తిపై తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. ఈ విషయంలో న్యాయవ్యవస్థ తన పాత్రను నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నట్లు రాహుల్‌గాంధీ తెలిపారు.

మోదీ సారథ్యంలోని ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను నాశనం చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. జంతర్ మంతర్?ను డినోటిఫై చేయటాన్ని ఆయన ఖండించారు. దేశ ప్రజలంతా తమతో ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాటం చేస్తున్నామన్నారు. సోమవారం జరిగిన నిరసనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. సోమవారం దిల్లీ వీధుల్లో తాము చేపట్టిన నిరసనలకు హాజరై, మద్దతు తెలిపిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓటు చోరీ వెనుక ఎవరున్నా శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టంచేశారు. జజుజ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు.

"మేమంతా ఇక్కడ ఏకతాటిపై, ఒక్కటిగా నిలబడి ఉన్నాం. నేను సోమవారం చెప్పినట్లు సమాంతరంగా నిరసనలు ఏమీ లేవు. అది ఒకే ఒక్క నిరసన. ఆ నిరసన లక్ష్యం కూడా ఒకటే. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థలు నాశమయ్యాయి. రాజ్యాంగాన్ని చింపివేశారు. నిజమైన ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు మేమంతా కలిసి పోరాటం చేస్తున్నాం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియను నాశనం చేశారు. ధ్వంసమైన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే మా లక్ష్యం. జంతర్‌మంతర్‌ను డినోటిఫై చేయడాన్ని ఖండిస్తున్నాం. దేశ ప్రజలంతా మాతో ఉన్నారు. దేశ భవిష్యత్తు కోసమే మేము పోరాటం చేస్తున్నాం. నిన్న జరిగిన నిరసనల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఓటు చోరీ వెనుక ఎవరు ఉన్నా శిక్ష అనుభవించాల్సిందే. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయి."



"దేశానికి ఉన్న ఒకే ఒక శత్రువు బీజేపీ. నిరసనలు తెలిపే హక్కును కూడా బీజేపీ లాక్కుంది. ప్రజాస్వామ్యం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. ఓటు చోరీతోనే బంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. స్వేచ్ఛాయుత ఎన్నికల వ్యవస్థను జ్ఞానేశ్‌కుమార్ నాశనం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ చోరీ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే ఆపాలి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ప్రజలు కోపంగా ఉన్నారు. నిరసనలను అణిచివేయాలని చూస్తున్నారు. జంతర్‌మంతర్‌లో నిరసనలు చేయకుండా డీనోటిఫై చేశారు. జంతర్‌మంతర్‌ను డీనోటిఫై చేస్తే నిరసనలు ఎక్కడ చేయాలి? రాజ్యాంగ సంస్థలు ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారాయి." అని ఇండియా కూటమి నేతలు విమర్శించారు.

ఈ తేనీటి విందు భేటీకి౼ూ×జజ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేష్, శశిథరూర్, పవన్ ఖేఢాతోపాటు ఆర్జేడీ నేతలు తేజస్వీ యాదవ్, మనోజ్ ఝూ, జేఎంఎం నుంచి మహువా మాజీ, టీఎంసీ నేత మహువా మొయిత్రా, లెఫ్ట్ నేతలతోపాటు విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ భేటీకి ముందు రాహుల్ గాంధీ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించే ఈ ప్రజా ఉద్యమంలో ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉన్నాయని చెప్పారు. తమ పోరాటం కొనసాగుతుందన్నారు. తేనీటి విందు తర్వాత మీడియాతో మాట్లాడనున్నట్లు తెలిపారు. ఆందోళనలన్నీ ఒక్కటే అని

## దేశ ప్రజలంతా మోదీ, ఎన్డీఏ వైపే-

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్షాల తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ సాధిస్తున్న అపారమైన ప్రజాదరణను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ూ×= సాకుతో దేశంలోకి చొరబాటుదారులను ఓటర్లుగా మార్చాలనే కాంగ్రెస్ కుట్రలను దేశ ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని స్పష్టం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కూటమికి ఘోర పరాజయం తప్పదని అమిత్ షా జోస్యం చెప్పారు. బీజేపీ, మోదీల విజయాన్ని ఏదో ఒక కారణం చెప్పి కొట్టిపారేసే బదులు, కాంగ్రెస్ పార్టీ తమ వైఫల్యాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఒకప్పుడు సుదీర్ఘకాలం ఏలిన రాష్ట్రంలోనే గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నిక కూడా గెలవలేకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. కల్పిత మీడియా ఈవెంట్లు, నిరంతర అబద్ధాల ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం సాధ్యం కాదని హితవు పలికారు. వచ్చే 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించబోతోందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆయన మిత్రపక్షాలు వరుసగా నాలుగో ఓటమికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. "బీజేపీ, మోదీ సాధిస్తున్న ప్రజాదరణను కేవలం ఒక ఎస్ఐఆర్ కారణమని కొట్టిపారేస్తున్నారు. మీరు నిజానికి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు మీరు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న ఒక పెద్ద రాష్ట్రంలో(గుజరాత్‌లో), గత 41 ఏళ్లుగా ఒక్క ఎన్నికల్లో కూడా గెలవలేకపోయారు. ఇది మీ పార్టీ తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం. ఇటీవలే దేశంలో మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ూ×= ముసుగులో చొరబాటుదారులకు రక్షణ కల్పించే మీ వ్యూహాన్ని దేశప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారు. ఇకపై వారు మీ కుతంత్రాలకు లొంగరని నేను రాహుల్ గాంధీకి చెప్పాలనుకుంటున్నాను. 2029లో ఘోర పరాజయాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని రాహుల్, ఆయన సహచరులకు కూడా నేను చెప్పాలనుకుంటున్నాను. 2029 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే భారీ మెజారిటీని సాధించబోతోంది. కాంగ్రెస్ మరొక పరాజయం వైపు, వరుసగా నాల్గో ఓటమి వైపు పయనిస్తోంది. దేశప్రజలు మోదీ, బీజేపీ, ఎన్డీయే వెంటే ఉన్నారు. ఈ సత్యాన్ని మీరు తిరస్కరించలేరు." రాష్ట్రాలు, ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుస ఓటములు తప్పట్లేదని అమిత్ షా తెలిపారు. గుజరాత్, బంగాల్, తమిళనాడు, యూపీలో కాంగ్రెస్ దారుణ పరాజయం పొందిందన్నారు. ఈ ఓటములకు ఎన్నికల సంఘాన్ని నిందించవద్దని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అన్ని ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని, అందుకే కొత్తగా బ్యాలెట్ బాక్సులు అంటోందని ఎద్దేవా చేశారు. ఇవే ఈవీఎంలతో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది కదాని అడిగారు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకే ఈ ఆందోళనలు చేస్తుందని దుయ్యబట్టారు. "ఇటీవల దేశంలోని మూడు రాష్ట్రాల్లో బంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిలో ఉప ఎన్నికలు జరిగాయి. బంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిలో జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేదు. నౌగావ్‌లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి 1,42,000 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ ఈ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ నుంచి కైవసం చేసుకుంది. నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి 76శాతం ఓట్లతో గెలిచి 1,22,000 ఓట్ల భారీ ఆధిక్యాన్ని సాధించారు. బంగాల్‌లోని రెజీనగర్‌లో బీజేపీ 75,000కు పైగా ఓట్ల తేడాతో విజయం సాధించి తృణమూల్ నుంచి ఆ స్థానాన్ని చేజిక్కించుకుంది. అలాగే పుదుచ్చేరిలో మిత్రపక్షమైన౼ూ×చీ=జకి చెందిన చీణూ అభ్యర్థి 8,482 ఓట్ల తేడాతో గెలుపొందగా, కాంగ్రెస్ కేవలం 22% ఓట్లను మాత్రమే సాధించగలిగింది" అమిత్ షా అన్నారు.

## కేంద్రమంత్రి మురుగన్ రాజీనామా

**అక్కడ బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం!**

**తమిళనాడులో బీజేపీని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో, కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు.**



కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ మంగళవారం తన మంత్రి పదవికి, అలాగే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తమిళనాడులో బీజేపీని బలోపేతం చేసేందుకు తాను అక్కడికి తిరిగి వెళ్లాలని అనుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయమై మురుగన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుతం సమాచార, ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సహాయ మంత్రి పదవిలో ఉన్న మురుగన్? ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా తన రాజీనామాపై బీజేపీ నాయకుడు ఎల్. మురుగన్ మీడియాతో మాట్లాడారు. "నేను తమిళనాడు వెళ్లాలనుకుంటున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశా. రాష్ట్రంలో మా పార్టీని బలోపేతం చేసి, 2029 ఎన్నికలకు రంగం సిద్ధం చేయాలనుకుంటున్నా. ప్రధాని ఎల్లప్పుడూ తమిళుల ఆత్మగౌరవాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారు. రెండు రోజుల క్రితం ఆయన తమిళనాడులో కూడా పర్యటించారు. ఆయన పట్ల ప్రజల ఉత్సాహాన్ని, ప్రేమను, ఆప్యాయతను నేను ప్రత్యక్షంగా చూశా. భారతదేశం, తమిళనాడు, బీజేపీ పట్ల మోదీకున్న అంకితభావాన్ని చూశాక, నేను కూడా పార్టీకి మరింత సమయం కేటాయించాలనే కోరిక నాలో కలిగింది. ఆయన నాయకత్వం నుంచి నేను పొందిన స్ఫూర్తి నాలోని బాధ్యతా భావాన్ని మరింత బలపరిచింది. కాబట్టి, ఇప్పుడు నేను క్షేత్రస్థాయికి తిరిగి వెళ్లి, మన కార్యకర్తలతో కలిసి నిలబడాలని భావిస్తున్నా. అంతేకాదు, 2029 లోక్‌సభ ఎన్నికల ముందు తమిళనాడులో బీజేపీని బలోపేతం చేయడానికి పూర్తి సమయం అంకితం చేయాలనుకుంటున్నా. మంత్రి పదవుల నుంచి నాకు ఉపశమనం కలిగించి, పార్టీని బలోపేతం చేయడానికి నన్ను రాష్ట్రానికి పంపాలని ప్రధానమంత్రిని అభ్యర్థించా."

### భారత మాతకు, తమిళనాడుకు సేవ చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవం

మోదీ నాయకత్వంలో 'భారత మాత'కు, తమిళనాడుకు సేవ చేయడం తన జీవితంలో దక్కిన అత్యంత గొప్ప గౌరవమని మురుగన్? అన్నారు. సామాన్య పౌరుడి నుంచి కేంద్ర మంత్రి స్థాయి వరకు తాను సాగించిన ప్రయాణాన్ని మురుగన్ గుర్తుచేసుకున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించిన కుటుంబంలో జన్మించిన నేను, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర మంత్రివర్గంలో పనిచేయడం నా జీవితంలో లభించిన గొప్ప అదృష్టం. ఇకపై నేను ప్రతి గ్రామానికి, ప్రతి వీధికి వెళ్లి, ప్రజలను కలుస్తూ, మన కార్యకర్తలకు అండగా నిలుస్తూ, రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోనూ పార్టీ ఉనికిని విస్తరించడంలో సహాయపడాలనుకుంటున్నాను. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాలని, 'వికసిత్? భారత్' దిశగా సాగే ప్రయాణంలో ప్రతి కుటుంబం తమ స్థానాన్ని గుర్తించేలా సహాయపడాలని నేను కోరుకుంటున్నాను" అని మురుగన్? పేర్కొన్నారు.

### మురుగన్? రాజకీయ నేపథ్యం

కాగా, మురుగన్ 2021 సెప్టెంబర్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేస్తున్నారు. 2024 ఏప్రిల్?లో మధ్యప్రదేశ్ నుంచి ఎగువ సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2030 ఏప్రిల్?లో ముగుస్తుంది. అయితే, తాను తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలనుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన రాజ్యసభ ఎన్నికల్లో ఉత్తర్?ప్రదేశ్ నుంచి కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కూడా బీజేపీ తిరిగి అవకాశం కల్పించలేదు. అయినప్పటికీ, ఆయన కేంద్ర మంత్రివర్గంలో సభ్యుడిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా, వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మకు కూడా ఎగువ సభ ఎన్నికలకు తిరిగి నామినేషన్ దక్కలేదు. ఆయన కూడా తన పదవిలో కొనసాగుతున్నారు.

# స్వరాష్ట్రానికి కాంగ్రెస్ నేతలు



-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ నాయకులు సైతం హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. పార్టీ అగ్రనేతల పిలుపు మేరకు ఢిల్లీకి చేరుకున్న రాష్ట్ర నాయకులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇండీ కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**'మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొన్న నేతలు**

దేశంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు ఢిల్లీకి వెళ్లారు. ఇండీ కూటమి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ముఖ్యమంత్రితో పాటు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపకుండా చూడాలన్న డిమాండ్‌తో విపక్షాలు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన ఇండీ కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఢిల్లీలోని నిరసన ప్రదర్శన రాజకీయంగా ప్రాధాన్యం పొందింది.

**పోలీసు బారికేడ్లను దాటిన నిరసనకారులు**

ర్యాలీ సందర్భంగా ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఐదు అంచెల భద్రతా వలయం ఏర్పాటు చేసినప్పటికీ నిరసనకారులు ముందుకు సాగుతూ రెండు పోలీసు బారికేడ్లను దాటినట్లు సమాచారం. దీంతో అక్కడి పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న పోలీసులు నిరసనకారులను అడ్డుకునేందుకు లాఠీలను ప్రయోగించారు.

ఈ క్రమంలో ఆందోళనలో పాల్గొన్న ఇండీ కూటమి నాయకులు, కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. కొందరు పరుగులు తీస్తూ కిందపడగా, తొక్కిసలాట వంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. గందరగోళంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కిందపడిపోయారు. కొంతమందికి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో వారిని హుటాహుటిన ఆసుపత్రులకు తరలించినట్లు సమాచారం. పోలీసుల చర్యలతో నిరసన ప్రాంగణంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**సోమవారం ర్యాలీ ముగిసినా ఢిల్లీలోనే నేతలు**

సోమవారం ఢిల్లీలో నిరసన ర్యాలీ ముగిసిన అనంతరం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌కు తిరిగి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులంతా ఢిల్లీలోనే ఉండిపోయారు. దీంతో వారి తిరుగు ప్రయాణం వాయిదా పడింది.

మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాసంలో ఇండీ కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగిసిన అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల తిరుగు ప్రయాణంపై స్పష్టత వచ్చినట్లు సమాచారం. దీంతో మూడు రోజులుగా ఢిల్లీలో ఉన్న నాయకులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు విడతలవారీగా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

**పార్టీ కార్యక్రమాల అనంతరం స్వరాష్ట్రానికి**

ఏఐసీసీ పిలుపుతో ఢిల్లీకి వెళ్లిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు పార్టీ అగ్రనేతలతో సమావేశాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి బయలుదేరడంతో రాష్ట్ర నాయకుల పర్యటన ముగింపు దశకు చేరుకుంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ విభాగాల నాయకులు కూడా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. మొత్తంగా ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఇండీ కూటమి నిర్వహించిన నిరసన ర్యాలీ, పోలీసుల భద్రతా ఏర్పాట్లు, బారికేడ్ల వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలతో తెలంగాణ కాంగ్రెస్ నేతల ఢిల్లీ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మూడు రోజుల పర్యటన ముగియడంతో రాష్ట్ర నాయకత్వం తిరిగి తెలంగాణకు చేరుకోనుంది.

# హైదరాబాద్ రవాణా ముఖచిత్రంలో భారీ మార్పులు!



**హైదరాబాద్ :** మెట్రో నగరాలలో ట్రాఫిక్ రద్దీ పెద్ద సమస్యగా మారింది. నగరాల సుందరీకరణ, ప్రయాణ సౌలభ్యం కోసం ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. అయితే.. క్షేత్రస్థాయి పరిస్థితులు, వ్యయ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కొన్ని ప్రాజెక్టులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్ లో అత్యంత రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టాల్సిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళికలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ పలు మార్పులు చేసింది. గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం, కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు రూ. 1,090 కోట్ల వ్యయంతో ఏడు అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లైఓవర్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే.. నగరంలో మారుతున్న ట్రాఫిక్ అవసరాలు, స్థానిక భౌగోళిక పరిస్థితులు, వ్యయ నియంత్రణను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త ప్రణాళికల ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫ్కంజా ఇంజనీరింగ్ కాలేజీ వరకు రూ. 715.16 కోట్ల అంచనా వ్యయంతో సరికొత్త స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన బంజారాహిల్స్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద 2-లేన్ సింగిల్ వే ఫ్లైఓవర్, టీవీ9 జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు వంటి అనేక పనులను రద్దు చేశారు. ఈ మార్పుల వల్ల గతంలో కేఎన్ఆర్ కన్స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌ను రద్దు చేశారు. అంతేకాక, ఆ ఏజెన్సీ చెల్లించిన డిపాజిట్లను వెనక్కి ఇవ్వాలని నిర్ణయించారు. మొత్తం ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించి పనులను వేగవంతం చేయాలని కమిటీ భావిస్తోంది. ప్యాకేజీ-1 పరిధిని జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. గతంలో రూ. 580 కోట్లుగా అంచనా వేసిన ఈ ప్రాజెక్టు వ్యయాన్ని సవరిస్తూ, రూ. 365.85 కోట్లకు కుదించారు. అలాగే రోడ్డు నంబర్-45 జంక్షన్, ఫిలింనగర్ జంక్షన్ ప్రాంతాల్లోని పనుల ప్రణాళికను కూడా మార్చారు. ప్యాకేజీ-2 కింద ముగ్ధ జంక్షన్ నుంచి ముఫ్కంజా కాలేజీ వరకు, బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1కి అనుసంధానించే రాంపుతో కూడిన స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రూ. 510 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ. 349.31 కోట్లకు సవరించారు. ఈ రెండు ప్యాకేజీల నిర్మాణ పనులను ప్రస్తుతం మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థకు అప్పగించాలని స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. కేవలం రవాణా రంగానికే కాకుండా, నగరంలోని ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా స్టాండింగ్ కమిటీ పెద్దపీట వేసింది. ఆరాంఘర్ ? జూపార్కు మార్గంలో 6-లేన్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణానికి రూ. 799.74 కోట్ల సవరించిన అంచనాలను ఆమోదించారు. అలాగే ఒవైసీ హాస్పిటల్, బహదూర్‌పురా జంక్షన్ల వద్ద మల్టీలెవెల్ ఫ్లైఓవర్ల కోసం రూ. 161 కోట్లు కేటాయించారు. మరోవైపు, జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థల ఆధునికీకరణ, ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. చింతల్ చెరువుకు రూ. 20 కోట్లు, రాంపల్లి చెరువు అభివృద్ధికి రూ. 40 కోట్లు మంజూరు చేయడం ద్వారా జలవనరుల పరిరక్షణకు పెద్దపీట వేసినట్లైంది.

# హైస్పీడ్ రైల్ కారిడార్ల చిచ్చు!



**హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ కారిడార్ల వ్యవహారం ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ రగడకు కారణమవుతోంది. ఒకవైపు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసి, భూసేకరణకు హడావుడి చేస్తుంటే.. మరోవైపు అలైన్‌మెంట్ ఇంకా ఖరారే కాలేదని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలు కేవలం సాంకేతిక లోపాలా లేక రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న వ్యూహాలా అనే అనుమానాలకు తావిస్తున్నాయి. తెలంగాణ మీదుగా ముంబై, బెంగళూరు, చెన్నైలకు హైస్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు కోసం గతంలో రైల్వే అధికారులతో అనేక దఫాలు చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన రైల్వే అధికారులు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహదూర్‌గూడలో రైల్ హబ్ కోసం 400 ఎకరాలు కేటాయించడాన్ని ప్రాథమికంగా ఖరారు చేసుకున్నారు. రాష్ట్ర కేబినెట్ సైతం దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. అంతర్గతంగా మార్గాలను నిర్ణయించుకున్న అధికారులు, హాలియా వంటి పలు ప్రాంతాల్లో ఎరుపు, తెలుపు రంగులతో మార్కింగ్‌లు కూడా చేశారు. తెలంగాణ పరిధిలో ముంబై-పుణే కారిడార్ 93 కిలో మీటర్లు, హైదరాబాద్-బెంగళూరు 205 కిలోమీటర్లు, హైదరాబాద్-చెన్నై 180 కిలోమీటర్ల చొప్పున మార్గాలను ప్రతిపాదించారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పక్కనే వెళ్లేలా సవరణలు కూడా చేశారు. ఇదంతా సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ప్రకటన ఈ ప్రణాళికలన్నింటినీ ఒక్కసారిగా గందరగోళంలోకి నెట్టింది. కారిడార్ల అలైన్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదని, భూసేకరణ చేయడం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర మంత్రి స్పష్టం చేయడం వెనుక రాజకీయ కోణం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని, భూముల గుర్తింపు కోసం అధికారులను రంగంలోకి దించడం, దీనివల్ల ప్రజల్లో భయాందోళనలు తలెత్తడం రాజకీయంగా అధికార పార్టీకి ఇరుకును తెస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కింగ్‌లు వచ్చిన తర్వాత, అసలు అలైన్‌మెంట్ ఖరారే కాలేదనడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపాన్ని లేదా రాజకీయ లబ్ధి కోసమే ఉద్దేశపూర్వకంగా చేస్తున్న జాప్యాన్ని ఎత్తిచూపుతోంది.

ఒకవైపు అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో తాము వేగంగా అడుగులు వేస్తుంటే, కేంద్రం మాత్రం నిబంధనల పేరుతో బ్రేకులు వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ముందుకు వెళ్తే సహించేది లేదనే సంకేతాలను కేంద్రం పంపుతోంది. మొత్తానికి, హైస్పీడ్ రైల్ కారిడార్ల అలైన్‌మెంట్ తకరారు కేవలం సాంకేతిక సమస్య కాస్తా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాజకీయ రగడగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

నుంచి పోలింగ్ వరకు ప్రతి విషయంలోనూ ప్రత్యేక దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి నాయకులకు సూచించారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సామా రామ్మోహన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారభించడంతోపాటు ఆయా నాయకులతో సమావేశమవుతూ తమ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు.

**కార్యాచరణతో ముందుకెళ్లాలి**

మంత్రులు, ఎమ్మెల్యేలతో గంటకు పైగా జరిగిన సమీక్ష సమావేశంలో పట్టభద్రుల ఎన్నికలతోపాటు రాష్ట్రంలోని కరవు పరిస్థితులు, విద్యుత్తు కొరత లాంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ఎక్కడక్కడ తిప్పి కొట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఎన్నికలు జరుగుతున్న ఆరు ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయంతో పని చేయాలని, రెండు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్?లు నేతలకు దిశానిర్దేశం చేశారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రీన్ సిగ్నల్



-మొదటిపేజీ తరువాయి

వ్యవస్థ, పర్యాటకం మెరుగుపడనుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వివరించారు.

హైదరాబాద్ - శ్రీశైలం ఎన్‌హెచ్ 765పై ఎలివేటెడ్ కారిడార్‌కి విజ్ఞప్తిపై నూతన డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు కేంద్రమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. అలాగే పర్వతమాల పథకం ద్వారా తెలంగాణకు 5 రోప్ వేలకు ఆమోదం లభించింది. హైదరాబాద్ అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు మంత్రి సానుకూలంగా స్పందించారు. సేతు బంధన్ పథకం ద్వారా 3 ఆర్‌వోబీలకు ఆమోదం లభించిందని కోమటిరెడ్డి తెలిపారు.

**ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు ఆహ్వానం**

తెలంగాణలో 34 పనులకు సీఆర్ఐఎఫ్ నిధులను మంజూరు చేయాలని కోమటిరెడ్డి వెంటక్?రెడ్డి కోరగా నితిన్ గడ్కరీ కేంద్ర అధికారులను ఆదేశించారని వివరించారు. పుల్లూరు - అల్లంపూర్ - జట్రపోలు - పెంట్లవెల్లి - కొల్లాపూర్ - లింగాల - అచ్చంపేట - డిండి - దేవరకొండ - మల్లేపల్లి - నల్గొండ రాష్ట్ర జాతీయ రహదారులుగా మార్చాలని కోరడంతో సానుకూలంగా స్పందించారని తెలిపారు. అదే విధంగా ఎన్‌హెచ్ -65 హైదరాబాద్ - విజయవాడ - మచిలీపట్నం రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచుతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నవంబర్ 19 - 22 వరకు నిర్వహించే ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు గడ్కరీని కోమటిరెడ్డి ఆహ్వానించారు. గతంలో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మార్గంలో 7.1 కి.మీ మెట్రోరైలు మార్గానికి, ఇదే మార్గంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 5.5 కి.మీ డబుల్ డెకర్‌కు ఆమోదం తెలపాలని రహదారులు, భవనాల శాఖ ఇటీవల కేంద్రాన్ని కోరగా ఇవాళ ఆమోదం లభించింది.

## అడుగంటిన భూగర్భజలాలు



-మొదటిపేజీ తరువాయి

తరలిస్తూ పంటను బతికించుకునేందుకు శ్రమిస్తున్నట్లు రైతు రాజు తెలిపాడు. మరో 20 రోజుల పాటు ఇదే విధంగా నీటిని అందిస్తేనే పంట చేతికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశాడు. ఇప్పటికే అర ఎకరం వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో ఆ భూమిలో పశువులను మేపాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపాడు. "ఇంకా 20, 25 రోజులు పంటకు నీరు ఖచ్చితంగా పోయాలి. 25 రోజులు పోస్తేనే నోట్లోకి కొన్ని ముద్దలు వస్తాయి. లేదంటే మనం వదిలేసుకోవాల్సిందే. వదిలేసుకున్నాం అంటే తినటానికి కూడా ఉండదు. ప్రభుత్వం మమల్ని పట్టించుకోవాలి. మాకు ఏ పంట వేసుకోవాలి, ఏది వేసుకోవద్దని అధికారులు సూచనలు ఇవ్వాలి. ఎల్?నినోపై మాకు అవగాహన కల్పించాలి" - రాజు, రైతు

**స్పందించని అధికారులు**

ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటునా ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారులు కానీ, ఇతర సంబంధిత అధికారులు కానీ స్పందించలేదని రైతులు వాపోతున్నారు. పంట సాగు చేసే సమయంలో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా వంటి సమస్యలపై రైతులకు తగిన సూచనలు అందించాలని కోరారు. ఇప్పటికే కరెంట్ కష్టాలు ఎక్కువగా ఉన్నపటికీ పట్టపగలే లైట్స్ వెలుగుతున్నాయి. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి**

వరి పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరీ నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాజు లాంటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి సకాలంలో విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అలాగే పంటలకు నీటి కొరత ఏర్పడిన ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించి రైతులకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని అంచనా వేసి తగిన సలహాలు, సూచనలు అందించాలని కోరుతున్నారు.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్.. బీసీసీఐ రెండు కండిషన్లు

- ఆటగాళ్ల ఎంపికలో వయసు కంటే ఫిట్‌నెస్, ప్రదర్శనే ముఖ్యమన్న బీసీసీఐ అధ్యక్షుడు
- తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని స్పష్టీకరణ
- గిల్‌కు సీనియర్ల అనుభవం ఉపయోగపడుతుందన్న మన్హాస్
- బౌలింగ్ బాధ్యతల్లో బుమ్రా కీలకంగా మారగలడని వ్యాఖ్య
- ప్రపంచకప్ విజయానికి బౌలింగ్, ఫీల్డింగ్ కీలకమని కైఫ్ స్పష్టీకరణ



2027 వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? వయసు మీద పడుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు సీనియర్ల ఎంపికపై కొంతకాలంగా చర్చ సాగుతోంది. అయితే, వయసు ఒక్కటే ఆటగాడి ఎంపికకు ప్రాతిపదిక కాకూడదని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ స్పష్టం చేశారు. ఫిట్‌నెస్, ప్రదర్శనే కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే.

### ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం

ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా వ్యాఖ్యానించలేదని మన్హాస్ తెలిపారు. తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని చెప్పారు. అయితే, తన అభిప్రాయం ప్రకారం ఆటగాడి ఫిట్‌నెస్, మైదానంలో ప్రదర్శనే ఎంపికకు ప్రామాణికాలని స్పష్టం చేశారు. జట్టు కోసం ఆడుతూ విజయాలు అందించే సత్తా ఉంటే వయసును అడ్డంకిగా చూడకూడదని అభిప్రాయపడ్డారు.

### గిల్‌కు సీనియర్ల అండ

వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కోహ్లీ, రోహిత్, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అన్నారు. జస్‌ప్రీత్ బుమ్రా

వంటి ఆటగాళ్లు బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ బాధ్యతలను సమర్థంగా పంచుకోవడం జట్టుకు మేలు చేస్తుందని చెప్పారు. ఒత్తిడిలో కీలక సందర్భాల్లో సత్తా చాటిన ఆటగాళ్లు జట్టులో ఉండటం మంచి కలయిక అని అభిప్రాయపడ్డారు.

### బౌలింగ్, ఫీల్డింగే కీలకం: కైఫ్

మాజీ భారత బ్యాటర్ మహమ్మద్ కైఫ్ సైతం ప్రపంచకప్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో పిచ్‌లు గతంతో పోలిస్తే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం నాణ్యతే విజయాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచకప్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. కోహ్లీ, రోహిత్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

# ఆస్ట్రేలియా చేతిలో సౌతాఫ్రికా ఓటమి.. WTC ఫైనల్ రేసులో భారత్‌కు కలిసొచ్చే అంశాలివే!

దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా జట్టు అద్భుత విజయంతో ప్రారంభించింది. దర్బన్ వేదికగా కింగ్స్‌మీడ్ మైదానంలో (2026 అక్టోబర్ 13, మంగళవారం) ముగిసిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. మాట్ రెన్‌షా సెంచరీతో పాటు హాఫ్ సెంచరీతో అదరగొట్టగా.. స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ ఏకంగా 6 వికెట్ల హాల్‌తో చెలరేగి సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియా ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC 2025-27) పట్టికలో తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.





### ఆస్ట్రేలియా విజయం భారత్‌కు కలిసొచ్చేనా?:

దర్బన్ టెస్టులో సౌతాఫ్రికా ఓటమితో టీమిండియా శిబిరంలో కొంత ఊరట లభించింది. ప్రొటిస్ జట్టు ఓడిపోవడంతో వారి విజయాల శాతం (PCT) దెబ్బతిని 60 శాతానికి పడిపోయింది. సొంతగడ్డపై ప్రొటీస్ తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఎదురైన పరాజయంతో భారత్ కష్టాల్లో పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఔజ ఫైనల్ రేసులో నిలవాలంటే టీమిండియాకు ప్రతీ మ్యాచ్ ఎంతో కీలకం కానుంది. చిన్న పొరపాటు జరిగినా ఫైనల్ వెళ్లే అవకాశాలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది.

భారత్ ఆడే నెక్స్ట్ మ్యాచ్‌లు:

ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా ఇంకా 7 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

**న్యూజిలాండ్‌తో వారి గడ్డపై 2 టెస్టులు**

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో స్వదేశంలో 5 టెస్టులు

కొలంబోలో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న శుభ్?మన్ గిల్ నేతృత్వంలోని భారత్.. ఇకపై జరిగే ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించడంపై దృష్టి పెట్టాలి.. ఒకవేళ ఇండియా తన తదుపరి సిరీస్‌లలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలపై విజయాలు సాధిస్తే.. డైరెక్టుగా టాప్-2లోకి దూసుకెళ్లే అవకాశం ఉంది.

ఆస్ట్రేలియా: ప్యాట్ కమ్మిన్స్ సేన 11 మ్యాచ్‌లలో 108 పాయింట్లతో, 81.82 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

న్యూజిలాండ్: 72.22 శాతంతో రెండో స్థానంలో ఉంది.

భారత్: ప్రస్తుతం 51.52 శాతంతో ఐదో స్థానంలో ఉంది.

సౌతాఫ్రికా తాజా ఓటమితో 60 శాతానికి పడిపోయింది. సౌతాఫ్రికాకు ఆస్ట్రేలియాతో మరో 2 టెస్టులు, అలాగే బంగ్లాదేశ్, ఇంగ్లండ్‌లతో సిరీస్‌లు మిగిలి ఉన్నాయి. బంగ్లాదేశ్ కూడా రేసులో ఉండటంతో డబ్ల్యూటీసీ ఫైనల్ పోరు రసవత్తరంగా మారింది.

# ఉప్పల్‌లో ఇక ఫ్లాట్ పిచ్ కాదు: విండీస్‌ను ఢీ కొట్టేందుకు బిగ్ ప్లాన్: తిలక్ వర్మ కామెంట్స్ వైరల్

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) వేదికగా వెస్టిండీస్‌తో రేపు (అక్టోబర్ 14, 2026, బుధవారం) జరగనున్న నాలుగో టీ20 మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్, లోకల్ బాయ్ తిలక్ వర్మ (ుఅశ్రీఖని ఖుతీఖు) విలేకరుల సమావేశంలో మాట్లాడాడు. సొంతగడ్డపై మ్యాచ్ ఆడటం, పిచ్ పరిస్థితులు, తన బ్యాటింగ్ స్థానం, మూడో టీ20లో జరిగిన విచిత్రమైన రనౌట్ ఘటనపై తిలక్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు.





### పిచ్ ఎలా స్పందిస్తుందో చూడాలి:

ఉప్పల్ గ్రౌండ్‌లో సాధారణంగా ఫ్లాట్ వికెట్ ఉంటుందని, అయితే ఈసారి పిచ్ స్వభావాన్ని మార్చారని ప్రచారం జరుగుతోందని తిలక్ వర్మ తెలిపాడు. కానీ ఈసారి పిచ్‌లో మార్పులు చేశామని చెబుతున్నారు. రేపటి మ్యాచ్‌లో పిచ్ ఎలా ప్రవర్తిస్తుందో చూడాల్సి ఉంది. ప్రస్తుతం మేం బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఎంతో అగ్రెసివ్‌గా ఆడుతున్నాం.. నాకు, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డిలకు హైదరాబాద్ ఉప్పల్ మైదానంలో ఎన్నో (ఐపీఎల్ సన్‌రైజర్స్ అనుభవం) మ్యాచుల ఆడాం.. ఇది ఖచ్చితంగా మా టీమ్‌కు చాలా ప్లస్ అవుతుందని స్పష్టం చేశాడు.

### ఆ స్థానంలో బ్యాటింగ్ చేయాలని ఉంది:

తన బ్యాటింగ్ పొజిషన్ గురించి తిలక్ వర్మ మరోసారి క్లారిటీ ఇచ్చాడు. నాకు వ్యక్తిగతంగా నెంబర్ 3 పొజిషన్‌లో బ్యాటింగ్ చేయడం చాలా ఇష్టం.. కానీ ప్రస్తుతం జట్టుకు మిడిల్ ఆర్డర్‌లో నా అవసరం ఉంది. అందుకే టీమ్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నాను అని తెలిపాడు.

### మూడో టీ20లో దురదృష్టకర రనౌట్:

ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో తాను రనౌట్ అయిన తీరుపై తిలక్ వర్మ స్పందిస్తూ.. గత మ్యాచ్‌లో నేను అలా రనౌట్ అవ్వడం నిజంగా దురదృష్టకరం. నేను కొట్టిన షాట్ బౌండరీకి వెళ్లిపోయిందని అనుకున్నాను.. మైదానంలో ఉన్న హోర్డింగ్ ఫ్లాష్ కావడం వల్ల బాల్ ఫోర్ వెళ్ళిందేమో అని పొరబడ్డాను అని విచారం వ్యక్తం చేశాడు. ఈ అనుభవం నుంచి ఒక పాఠం నేర్చుకున్నాను. ఇక నుంచి ఆన్-ఫీల్డ్ అంపైర్ అధికారికంగా ఫోర్ (ఖీశీబతీ) సిగ్నల్ ఇచ్చే వరకు రన్ తీస్తూనే ఉంటాను అని నవ్వుతూ చెప్పుకొచ్చాడు.

### వెస్టిండీస్‌తో పోరుపై పర్ఫెక్ట్ ప్లానింగ్:

ప్రత్యర్థి వెస్టిండీస్ జట్టు ప్రమాదకరమైనదని తిలక్ వర్మ వ్యాఖ్యానించాడు. టీ20 క్రికెట్‌లో విండీస్ చాలా బలమైన జట్టు.. వారి టీమ్‌లో చివరి ప్లేయర్ వరకు హార్డ్ హిట్టింగ్ చేయగల సామర్థ్యం ఉంది.. కాబట్టి కరేబియన్ జట్టుని తక్కువ అంచనా వేయకుండా పర్ఫెక్ట్ ప్లాన్‌తో మైదానంలోకి

# తెలుగు ఇండస్ట్రీ లో ఈ జనరేషన్ 'టార్చ్ బేరర్లు వీళ్లే?



కొత్త పోర్ట్రెయిట్‌లో రితికా నాయక్ సింపుల్ స్టైల్ అందరి మనసులను గెలుచుకుంటోంది



తెలుగు సినిమా ఇండస్ట్రీ కొత్త పుంతలు తొక్కుతూ ముందుకు సాగుతుంది. సినిమాలను తీయడం ఒక ఆర్ట్. అనుకున్నది అనుకున్నట్టుగా విజువలైజ్ చేసి విజయం సాధించిన దర్శకుడికి దక్కే గౌరవం ప్రత్యేకమైనది. ట్రెండ్ సెట్ చేసిన దర్శకుడిని అనుకరిస్తూ కొంతమంది డైరెక్టర్స్ అదే బాటలో నడుస్తుంటారు. ఒక రంగంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, ఫ్రెష్ థాట్ ని ముందుకు తీసుకెళ్లే వాళ్ళని 'టార్చ్ బేరర్' అంటారు...'అరవింద సమేత' మూవీలో చెప్పినట్టుగా ప్రతి 30 సంవత్సరాలకు ఒకసారి బతుకు తాలుకు ఆలోచనలు మారుతుంటాయి. అలాగే సినిమా ఇండస్ట్రీలో కొన్ని సంవత్సరాలకు ఒకసారి సినిమాలు తీసే దర్శకుల ఆలోచన శైలి మారుతుంది. అలాగే సినిమాలు చూసే ప్రేక్షకుడి దృష్టి మారుతుంది. డిఫరెంట్ సబ్జెక్టులతో వచ్చే మూవీస్ ని ప్రేక్షకులు ఆదరిస్తూ ఉంటారు. ప్రస్తుతం ఈ జనరేషన్ లో తెలుగు సినిమా ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లే దర్శకులలో ముగ్గురుని 'టార్చ్ బేరర్లు' గా చెప్పుకోవచ్చు వాళ్ళెవరంటే.

### రాజమౌళి

వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ ఎమోషనల్ సన్నివేశాలను ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేలా తెరక్కించడం లో రాజమౌళి సిద్ధహస్తుడు. విఎఫ్ఎక్స్ కి ప్రాధాన్యమున్న సినిమాలను తీయడం మనవల్ల కాదని భ్రమ పడిన వాళ్లందరికీ షాకిస్తూ హాలీవుడ్ ఇండస్ట్రీని మెప్పించేలా సినిమాలను తీసి సక్సెస్ లను సాధించాడు. సినిమా సినిమాకు తన పరిధిని విస్తరించుకుంటూ ప్రస్తుతం పాన్ వరల్డ్ స్థాయికి చేరుకున్నాడు. ఒకప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీని పక్క ఇండస్ట్రీ వాళ్లే పట్టించుకునే వారు కాదు. అలాంటిది ఇప్పుడు ప్రపంచ స్థాయి దర్శకులు సైతం మన గురించి మాట్లాడుకుంటున్నారు అంటే అది రాజమౌళి వల్లే సాధ్యమైంది...

### సుకుమార్

మూస ధోరణిలో వెళ్తున్న సినిమాలకు స్వస్తి చెప్పి డిఫరెంట్ కథలను ట్రై చేసి, ప్రేక్షకుడి దృష్టి మార్చేసిన దర్శకుడు సుకుమార్...ఆడియన్స్ అభిరుచి కి అనుగుణంగా సినిమాలను చేస్తూ, కథల విషయంలో చాలా కేర్ తీసుకొని, స్క్రీన్ ప్లే ని అత్యుత్తమంగా ప్రజెంట్ చేశాడు. సుకుమార్ చేసిన ప్రయోగాలు కొన్ని విఫలమై ఉండొచ్చు. కానీ సినిమాను మాత్రం కొత్తగా ప్రజెంట్ చేయడంలో ఆయన ఎప్పుడు ఫెయిల్ అవ్వలేదు...

### సందీప్ రెడ్డి వంగ

'అర్జున్ రెడ్డి' సినిమాతో ప్రేక్షకుడి ఆలోచన ధోరణిని మార్చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా... బోల్డ్ కంటెంట్ తో సినిమాని చేసి నెక్స్ట్ లెవెల్ సక్సెస్ ను సాధించవచ్చని ప్రూవ్ చేశాడు... సినిమా మ్యూజిక్, నేపథ్య సంగీతం, సౌండ్ ఎఫెక్ట్స్ ను కొత్తగా ప్రజెంట్ చేసిన దర్శకుడు సందీప్... అర్జున్ రెడ్డి, అనిమల్ రెండు సినిమాలతో ప్రేక్షకుల దృష్టి కోణాన్ని మార్చేశాడు. హీరో అంటే రాముడు మంచి బాలుడు గా ఉండాలని అలా ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మే వాళ్ల నమ్మకాన్ని పటాపంచలు చేశాడు. హీరో అంటే సాధారణ మనిషి మాత్రమే. ఆయనలో పాజిటివ్ లతో పాటు నెగెటివిటీస్ కూడా ఉంటాయని చూపించాడు. అందుకే సందీప్ సైతం టార్చ్ బేరర్ గా నిలిచాడు...

ఈ ముగ్గురు దర్శకులు హిట్ సినిమాలను ఇస్తూనే తర్వాతి తరంలో వచ్చే మేకర్స్ కి ధైర్యాన్ని ఇచ్చారు. అందుకే వీళ్లు నిజమైన 'టార్చ్ బేరర్లు' అయ్యారు...



సింపుల్ బ్లాక్ బ్రాలెట్ లుక్‌లో సోనం బజ్వా మెరుపులు

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512